మీ గళం..మా కళం...

# నమస్తే హైదరాబాద్

NAMASTHE HYDERABAD

తెలుగు దిన పత్రిక

RNI No: APTEL/2012/45237

| రంగారెడ్డి | మంగళవారం | 18-11-2025 | సంపుటి : 14 | సంచిక :162 | పేజీలు :8 | వెల : 3 రూ |
|---|---|---|---|---|---|---|
| RangaReddy | Tuesday | 18-11-2025 | Volume :14 | Issue:162 | Pages:8 | Cost : 3 |

**విలేకరులు కావలెను**

నిత్యనూతనంగా వెలువడుతూ
విశేష ప్రజాధరణ పొందుతున్న
**నమస్తే హైదరాబాద్**
తెలుగు దిన పత్రికకు
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని
జిల్లా, మండల కేంద్రాలలో
విలేకరులు కావలెను.

సీనియర్‌లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం

**Ph: 9912580066**

## సౌదీలో ఘోర రోడ్డు ప్రమాదం

### 45 మంది హైదరాబాదీలు మృతి



**నవంబర్ 17 (నమస్తే హైదరాబాద్) :**సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది హైదరాబాద్ వాసులు మరణించినట్లు తెలంగాణ హజ్ కమిటీ అధికారికంగా ప్రకటించింది. పవిత్ర ఉమ్రా యాత్రకు వెళ్లిన వీరి ప్రయాణం విషాదాంతంగా ముగిసింది. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది ఉండటం అందరినీ తీవ్రంగా కలచివేస్తోంది. ఈ దుర్ఘటనతో హైదరాబాద్ నగరంలో, ముఖ్యంగా మృతుల కుటుంబాల్లో తీరని విషాదం అలుము కుంది. సోమవారం తెల్లవారుజామున మక్కాలో ఉమ్రా యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని, మదీనా నగరానికి బస్సులో బయలుదేరారు. మదీనా నగరానికి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉండగా, వీరు ప్రయాణిస్తున్న బస్సు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఓ డీజిల్ ట్యాంకర్‌ను బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు ప్రాథమిక సమాచారం. ఈ భయానక ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న మొత్తం 45 మంది అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మృతుల్లో 17 మంది పురుషులు, 18 మంది మహిళలు,

2లో

### తాత్కాలిక పరిష్కారాలతో కాలుష్యాన్ని అరికట్టలేమన్న

## సుప్రీంకోర్టు



2లో

**ఢిల్లీ, నవంబర్ 17 (నమస్తే హైదరాబాద్) :**ఎన్‌సీఆర్ ప్రాంతంలో వాయు నాణ్యత సూచీ తరచూ 300 నుంచి 400 దాటుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తాత్కాలిక పరిష్కారాలతో కాలుష్యాన్ని అరికట్టలేమని పేర్కొంది. కాలుష్యం నేపథ్యంలో రాజధానిలో నిర్మాణాలపై నిషేధం విధించేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. పర్యావరణ ఆందోళనలు, అభివృద్ధి మధ్య సమతుల్యం ఉండాలని స్పష్టం చేసింది.ఢిల్లీలో

### సౌదీ బస్సు ప్రమాదం

## ప్రధాని ఫోన్



**ఇంటర్నెట్ డెస్క్:** సౌదీ అరేబియాలో జరిగిన బస్సు ప్రమాద ఘటనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ఈ విషయమై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా తనకు ఫోన్ చేసి మాట్లాడారని చెప్పారు. ప్రమాదం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కిషన్ రెడ్డి.. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని దేవుణ్ని ప్రార్థిస్తున్నానన్నారు. ఈ ఘటనపై కేంద్ర విదేశాంగ మంత్రి జయశంకర్‌తో పాటు సౌదీలోని జెడ్డాలో ఉన్న ఇండియన్ హై కమిషన్‌తో మాట్లాడ్డం జరిగిందని కిషన్ రెడ్డి తెలిపారు. వారు కూడా తక్షణ చర్యలు చేపట్టడం సహా అక్కడి ప్రభుత్వం ఉన్నత స్థాయి దర్యాప్తు చేస్తోందని ఆయన అన్నారు. మృతదేహాల గుర్తింపు ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందని వెల్లడించిన ఆయన.. మృతుల అంత్యక్రియలను సౌదీలోనే నిర్వహిస్తున్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇక్కడి నుంచి బాధిత కుటుంబ సభ్యులను పంపే దిశగా చర్యలు ముమ్మరం చేస్తోందన్నారు. వీరితో పాటు కేంద్ర విదేశాంగ శాఖకు చెందిన ఒక బృందం అక్కడ సహాయక చర్యలు చేపట్టేందుకు వెళ్తుందని ఆయన పేర్కొన్నారు. మదీనాలో ఆయిల్ ట్యాంకర్‌ను బస్సు ఢీకొట్టడంతో జరిగిన ఈ ప్రమాదంలో హైదరాబాద్ నగరానికి చెందిన 45 మందితో పాటు కర్ణాటకకు చెందిన ఒక వ్యక్తి మృత్యువాతపడ్డారు. బస్సులో ఉన్నవాందరూ దాదాపుగా సజీవ దహనమయ్యారు. ఇందులో సికింద్రాబాద్‌లో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది ఉన్నారు.

### కొంపల్లి ఫ్లైఓవర్ ఆలస్యంపై

## ఎంపీ సీరియస్



**హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే హైదరాబాద్) :** నగరంలోని కొంపల్లి ఫ్లైఓవర్ పనుల ఆలస్యంపై ఎంపీ ఈటల రాజేందర్ సీరియస్ అయ్యారు. కాంట్రాక్టర్స్, అధికారులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఇలానే చేస్తే ప్రజల చేతుల్లో దెబ్బలు తప్పవంటూ హెచ్చరించారు. మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ట్రాఫిక్ కష్టాలపై ఈటల దృష్టిసారించారు. ఫ్లై ఓవర్ల నిర్మాణం వేగవంతం చేయాలని కొత్త ఫ్లై ఓవర్స్ మంజూరు చేయాలని నిన్న కేంద్రమంత్రి గడ్కరీని కలిసిన ఈటల.. ఈరోజు (సోమవారం) కొంపల్లి ఫ్లై ఓవర్ పనులను పరిశీలించారు. అయితే ఫ్లైఓవర్ పనుల్లో ఆలస్యంపై అధికారులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. 2022 ఏప్రిల్‌లో ఫ్లై ఓవర్ పనులు మొదలయ్యాయని.. మూడేళ్లు పూర్తయినా పనులు మాత్రం అవ్వలేదని ఆగ్రహించారు. ఫ్లై ఓవర్ ఆలస్యం వల్ల పదుల సంఖ్యలో ప్రాణాలు పోయాయని.. వందల మందికి గాయాలు అయ్యాయని ధ్వజమెత్తారు. నిర్మాణం చేస్తామని.. మంచి చేస్తామని వచ్చిన కాంట్రాక్టర్లు ఆలస్యం చేసి ప్రజల ఉసురు తీస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. వీరికి ఏం పనిష్మెంట్ ఇచ్చినా తప్పులేదని... చేతకాని వారు టెండర్ ఎందుకు వెయ్యాలని.. అధికారులు ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. అసలు కాంట్రాక్టర్లకు ఉన్న సమస్య ఏంటి అంటూ ఈటల ప్రశ్నించారు.ఉప్పల్ ఫ్లైఓవర్ కి ఆరేళ్లు... ఈ ఫ్లైఓవర్ కి మూడేళ్లు గడిచిపోయాయని.. ఆలస్యంతో ప్రాణాలు పోతున్నాయని చెప్పుకొచ్చారు. రెండేళ్లు అంటే

2లో

### డిసెంబర్‌లో

# 'స్థానిక' ఎన్నికలు

**హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే హైదరాబాద్) :** తెలంగాణ రాష్ట్రంలో సుమారు 20 నెలలుగా స్థానిక సంస్థల పాలకవర్గాల పదవీకాలం ముగిసిపోవడంతో.. ఈ ఎన్నికలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో.. రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజా పాలన వారోత్సవాలు ముగిసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది.

ప్రభుత్వం తొలుత డిసెంబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజా పాలన వారోత్సవాలు' నిర్వహించనుంది. ఈ వారోత్సవాల్లో కొత్త సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించడం.. వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి ముఖ్యమైన పనులు ఉంటాయి. ఈ కార్యక్రమం పూర్తయిన వెంటనే.. డిసెంబర్ రెండో వారంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉంది.

స్థానిక సంస్థల ఎన్నికల ఆలస్యానికి ప్రధాన కారణం బీసీ రిజర్వేషన్ల అంశమే. గతంలో రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకుంది. అయితే.. ఈ రాజకీయ నిర్ణయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదించడంలో సమస్యలు ఎదురయ్యాయి. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం.. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదు అనే నియమం ఇక్కడ అడ్డు తగులుతోంది. రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా ఉండేందుకు.. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 50 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని.. అయితే పార్టీ పరంగా మాత్రం 42 శాతం సీట్లను బీసీలకు



కేటాయించాలని గతంలో నిర్ణయించింది. ఈ న్యాయపరమైన అంశాలను పరిష్కరించడానికి కొంత సమయం అవసరమైంది.

**మొదట సర్పంచ్‌ల ఎన్నికలు..**

ఈ ఆలస్యం కారణంగా.. ప్రభుత్వం ఎన్నికలను దశలవారీగా నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. మొదట సర్పంచ్ ఎన్నికలు నిర్వహించి.. ఆ తర్వాత కొంత సమయం తీసుకుని ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది.

స్థానిక సంస్థల పాలకవర్గాలు లేకపోవడం వల్ల గ్రామాల్లో, మండలాల్లో అభివృద్ధి పనులు మందగిస్తున్నాయి. కాబట్టి.. తాజా కేబినెట్ నిర్ణయంతో డిసెంబర్ నెలలోనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉండటంతో.. ప్రజలు, రాజకీయ పార్టీలు ఈ పరిణామాలను ఆసక్తిగా గమనిస్తున్నాయి.ఇదిలా ఉండగా.. కేబినెట్ నిర్ణయాల్లో భాగంగా.. సౌదీలో మృతి చెందిన ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందించాలని కేబినెట్ తీర్మానించింది. ప్రమాద స్థలాన్ని పర్యవేక్షించడానికి.. బాధిత కుటుంబాలకు సహాయం అందించడానికి మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎమ్మెల్యే, మైనార్టీ విభాగానికి చెందిన అధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీ అరేబియాకు పంపాలని నిర్ణయించింది. మృతదేహాలకు అక్కడే.. వారి మత సంప్రదాయం ప్రకారం ఖననం చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం బాధిత కుటుంబాల నుంచి ఇద్దరి చొప్పున కుటుంబ సభ్యులను సౌదీకి ప్రభుత్వ ఖర్చుతో తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది.

### నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి

## కట్టుబడి ఉన్నాము



**హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే హైదరాబాద్) :** రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డితో కలిసి సోమవారం మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 171.5 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మిర్యాలగూడ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు.

## సింగరేణి సీఎండీ ఆఫీస్ ముట్టడికి కవిత పిలుపు

**ఖమ్మం జిల్లా, నవంబర్ 17 (నమస్తే హైదరాబాద్) :** డిపెండెంట్ ఉద్యోగాలు కాపాడుకోలేని స్థితిలో ఇప్పుడు ఉన్నామని జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు చేశారు. ఈరోజు (సోమవారం) సత్తుపల్లి జేవీఆర్ ఓసీ సింగరేణిలో కార్మికులతో కవిత మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రెండేళ్లుగా మెడికల్ బోర్డ్ కోసం కొట్లాడుతున్నామన్నారు. డిసెంబర్ 13న సింగరేణి సీఎండీ కార్యాలయాన్ని ముట్టడి చేయబోతున్నామని ప్రకటించారు. సింగరేణి ఉద్యోగం ఒక కుటుంబానికి ఇన్సూరెన్స్ లాంటిదని... డిపెండెంట్ ఉద్యోగాల కోసం పోరాటం చేస్తామన్నారు. సింగరేణి గని కార్మికులకు ఇన్‌కమ్ ట్యాక్స్ కట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని.. 'మీకోసం పోరాటం చేసే మాకు అండగా ఉండాలి అని కోరుతున్నాం' అని కవిత అన్నారు. కొత్త బొగ్గు బ్లాక్‌లు సింగరేణికి అందించాలని డిమాండ్ చేశారు. కేంద్రం బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్ వ్యక్తులకు వేలం వేయడాన్ని ఒప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం సింగరేణికి అక్షరాలా రూ.40 వేల కోట్ల అప్పు ఉందని తెలిపారు.సింగరేణి కార్మికుల కోసం

2లో



## పాతాళంలో దాక్కున్నా వేటాడతాం..

**న్యూఢిల్లీ: నవంబర్ 17 (నమస్తే హైదరాబాద్)** దేశ రాజధాని ఢిల్లీలో పేలుడు ఘటనతో ప్రమేయం ఉన్న ముష్కరులను పాతాళంలో దాగినా వెతికి పట్టుకుంటామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా గట్టి వార్నింగ్ ఇచ్చారు. చేసిన నేరానికి కఠిన శిక్ష పడేలా చేస్తామన్నారు. ఫరీదాబాద్‌లోని సోమవారంనాడు జరిగిన నార్తర్న్ జోన్ కౌన్సిల్ 32వ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేసేందుకు

2లో



# సౌదీలో ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది హైదరాబాదీలు మృతి

10 మంది చిన్నారులు ఉన్నారని హజ్ కమిటీ అధికారులు తమ ప్రకటనలో వివరించారు.ఈ ప్రమాదంలో మరణించిన వారిలో 18 మంది హైదరాబాద్ విద్యానగర్‌కు చెందిన ఒకే కుటుంబ సభ్యులు కావడం ఈ విషాద తీవ్రతను రెట్టింపు చేసింది. రిటైర్డ్ రైల్వే ఉద్యోగి అయిన నజీరుద్దీన్, తన కుటుంబ సభ్యులందరితో కలిసి ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ యాత్రకు వెళ్లారు. మక్కాలో ప్రార్థనలు ముగించుకుని మదీనాకు వెళ్లే మార్గమధ్యంలో వారి కుటుంబంపై విధి ఇలా పగబట్టింది. ఒకేసారి కుటుంబంలోని 18 మందిని కోల్పోవడంతో వారి బంధువులు, స్థానికులు శోకసంద్రంలో మునిగిపోయారు.ఈ యాత్రను హైదరాబాద్‌కు చెందిన నాలుగు ట్రావెల్ ఏజెన్సీలు నవంబర్ 9వ తేదీన ఏర్పాటు చేశాయి. ప్రమాద వార్త తెలియగానే సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. సౌదీ అధికారులు ఈ ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.ఈ విషాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి, పలువురు కేంద్ర మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతదేహాలను వీలైనంత త్వరగా హైదరాబాద్‌కు తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఒకే నగరం నుంచి, ముఖ్యంగా ఒకే కుటుంబం నుంచి ఇంత పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోవడం హైదరాబాద్‌లో తీవ్ర విషాదాన్ని నింపింది.

# తాత్కాలిక పరిష్కారాలతో కాలుష్యాన్ని అరికట్టలేమన్న సుప్రీంకోర్టు

వేగంగా పెరుగుతున్న కాలుష్య సమస్యను అరికట్టేందుకు నిర్మాణాలపై నిషేధం విధించడం వంటి సంచలన ఆదేశాలు ఇచ్చేందుకు సుముఖంగా లేమని ఈ సందర్భంగా కోర్టు స్పష్టం చేసింది. ఈ కాలుష్య సంక్షోభాన్ని పరిష్కరించే లక్ష్యంగా నవంబర్ 19లోగా ఒక ప్రణాళికతో రావాలని కేంద్రాన్ని ఆదేశించింది. తాత్కాలిక పరిష్కారాలతో ఎలాంటి ప్రయోజనం ఉండదని, దీర్ఘకాలిక పరిష్కారాలను రూపొందించాలని సూచించింది.

# కొంపల్లి ఫ్లైఓవర్ ఆలస్యంపై ఎంపీ సీరియస్

2024 ఏప్రిల్‌లో పూర్తి కావాలని కానీ.. ఇంకా కాలేదంటూ ఆగ్రహించారు. సంవత్సరంగా వాళ్ల కాంట్రాక్ట్ ఎందుకు రద్దు చేయలేదని అధికారులను ప్రశ్నించారు. కాంట్రాక్టర్ స్పందించకపోతే దెబ్బలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. ఇలాంటి వాళ్లను జైల్లో పెట్టించాలన్నారు. మనుషులు చచ్చిపోతున్నా పట్టించుకోరా? అంటూ మండిపడ్డారు. పక్కన ఉన్న రోడ్లపై ఉన్న గుంతలన్నా పూడ్చి వాహనాలు వేగంగా వెళ్లేలా చూడాలి కదా.. అధికారులు ఎందుకు చేయడం లేదని నిలదీశారు. షాపులలో రెండు ఇంచుల దుమ్ము పడుతోందన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ప్రజల చేతుల్లో దెబ్బలు తప్పవని ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు.

# సింగరేణి సీఎండీ ఆఫీస్ ముట్టడికి కవిత పిలుపు

మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేయాలని కోరుతున్నామన్నారు. ఆసుపత్రి నిర్మాణం చేసే లోపు కార్పోరేట్ హాస్పిటల్స్‌లో వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు పెర్మినెంట్ అయ్యేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు. బొగ్గు బావిలోకి దిగే ముందు మైసమ్మకు మొక్కుకుని జాగ్రత్తగా ఉండాలని కవిత సూచించారు.

# పాతాళంలో దాక్కున్నా వేటాడతాం..

కేంద్రం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు.

మరో కుట్రదారు అరెస్టు

ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన పేలుడుకు సంబంధించి జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా క్వాజిగుండ్‌కు చెందిన మరో వ్యక్తిని ఎన్ఐఏ సోమవారంనాడు అరెస్టు చేసింది. నిందితుని జసిర్ బిలాల్ వానీ అలియాస్ డేనిష్‌గా గుర్తించింది. సూసైడ్ బాంబర్ డాక్టర్ ఉమర్ ఉన్ నబీకి వానీ సన్నిహితంగా ఉంటూ అతనికి టెక్నికల్ సపోర్ట్ ఇచ్చాడని, దాడి వ్యూహరచనలో కీలకంగా వ్యవహరించాడని ఎన్ఐఏ గుర్తించింది. ఢిల్లీలో పేలుడుకు ఘటనకు ముందు డ్రోన్లను మెరుగుపరచడం, రాకెట్ల తయారీకి అతను ప్రయత్నం చేసినట్టు అధికారులు చెబుతున్నారు. వానీని విచారించి మరిన్ని వివరాలు రాబట్టేందుకు ఎన్ఐఏ కార్యాలయానికి తీసుకువచ్చారు.నవంబర్ 10వ తేదీ సాయంత్రం లాల్‌ఖిలా మెట్రో స్టేషన్ సమీపంలో హ్యుండాయ్ ఐ20 కారులో శక్తివంతమైన పేలుడు సంభవించి 15 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. పలు వాహనాలు మంటల్లో కాలిపోయాయి. ఈ కేసు దర్యాప్తు బాధ్యతను ఎన్ఐఏకి కేంద్రం అప్పగించింది.

# ఆర్యవైశ్య సంఘం జనరల్ సెక్రటరీగా నంగనూరు చంద్రశేఖర్ గుప్తా..

## పిర్జాదిగూడ ఆర్యవైశ్య సంఘం కార్తీక వనభోజనాలు, నూతన కమిటీ ప్రమాణ స్వీకారం మహోత్సవం..



**మేడిపల్లి (నమస్తే హైదరాబాద్):** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఆర్యవైశ్య సంఘం జనరల్ సెక్రటరీగా పీర్జాదిగూడ బీజేపీ సెక్రటరీ( ఈస్ట్) నంగనూరు చంద్రశేఖర్ గుప్తాను సంఘం సభ్యులు ఎన్నుకున్నారు.. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు నిర్వహించారు, అనంతరం ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు. ఆర్యవైశ్య సంఘం జనరల్ సెక్రటరీగా నంగనూరు చంద్రశేఖర్ గుప్తాను, అధ్యక్షుడిగా వెచ్చా అరవింద్ కుమార్, కోశాధికారి ఎం. వెంకటేశం లను ఎన్నుకున్నారు. వీరిని మేడిపల్లి మండల అధ్యక్షులు వెచ్చ వెంకట్ కుమార్ గుప్తా మరియు మేడిపల్లి మండల కార్యదర్శి శ్రీ కటకం శేఖర్ గుప్తా మరియు అమావాస్య అన్న ప్రసాద అధ్యక్షులు రాజరాజు గుప్త మరియు బిజెపి సీనియర్ నేత డాక్టర్ చికోటి ప్రవీణ్ గుప్త ఆధ్వర్యంలో ప్రమాణస్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ నగర్ గుడిసె వాసులకు న్యాయం చేయండి

**మేడిపల్లి (నమస్తే హైదరాబాద్):** మేడిపల్లి మండలం పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భగత్ సింగ్ నగర్ కాలనీ వాసులకు న్యాయం చేయాలని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో మేడిపల్లి మండల తహసిల్దార్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రచ్చ కిషన్ మరియు జె లక్ష్మీలు మాట్లాడుతూ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భగత్ సింగ్ నగర్ కాలనీలో గత 20 సంవత్సరాల క్రితం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గుడిసెలు వేయడం జరిగినది. ఇప్పుడు కొంత మంది ఖాళీ ఉన్న ప్రదేశంలో కొత్త గుడిసెలు వేయడంతో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుంది. కావున ఇప్పుడు వేస్తున్న కొత్త గుడిసెలను వెంటనే తొలగించాలని మరియు ప్రభుత్వం ఇచ్చిన పట్టాలపై కొంతమంది కోర్టు కేసు వేయడం జరిగినది. ఈ కోర్టు కేసు ఆపిల్ వెయ్యాలని కొంతమంది గుడిసెలలో డప్పు చాటింపు చేసి లాయర్ కు డబ్బులు కట్టాలని పేద ప్రజల దగ్గర డబ్బులు వసూలు చేయడం జరుగుతున్నది. కావున ఈ కేసును ప్రభుత్వమే తీసుకుని ఈ పేద ప్రజల పక్షాన న్యాయం పోరాటం చేయాలని లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాలని ఎవరైతే స్థానికంగా గుడిసెలలో నివాసం ఉంటున్నారో పట్టాలు రాని వారికి వెంటనే ప్రభుత్వం తరపున పట్టాలు ఇప్పించాలని ఎవరైతే కాలి స్థలాన్ని కబ్జా చేయాలని ప్రయత్నం చేస్తున్నారో వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ పార్టీ నుంచి తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి



సిహెచ్ మాధవి, బీసీ సంఘం జిల్లా నాయకురాలు కే ప్రమీల, బి కే ఎం యు కార్యదర్శి - అధ్యక్షులు కే మహాలక్ష్మి, భూతం ఐలయ్య, ఇస్తారి పాల్గొనడం జరిగినది.

# కార్మిక కుటుంబానికి నష్టపరిహారం ఇప్పించిన బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు రవి



**కూకట్పల్లి (నమస్తే హైదరాబాద్):** పటాన్ చెరువు నియోజక వర్గం లోని సుల్తాన్ పూర్ ఇండస్టీ ఐటీ పార్క్ ఏరియాలో ఎం గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ లో గత నాలుగు నెలల నుండి వెంకటేష్ అనే కార్మికుడు పనిచేసేవారు. కంపెనీ పని చేస్తున్న టైంలో జాగ్రత్తలు సేఫ్టీ అలాంటివి ఏమి పట్టించుకోకుండా జెసిబి ట్యాంకు నందు డీజిల్ పోయడానికి జెసిబి బొక్కన లో ఎక్కించారు. దాంతో అకస్మాత్తుగా జెసిబి బొక్కన పై నుండి కింద పడిపోయి మెదడుకు తీవ్ర గాయం అవ్వడంతో అక్కడున్న కార్మికుల యజమాన్యం వెంటనే దగ్గర్లో ఉన్న ఒక ప్రైవేట్ హాస్పిటల్ కి తీసుకెళ్లడం జరిగింది. ఇంకా మెరుగైన వైద్యం కోసం బేగంపేట్ లో ఉన్న వెల్నెస్ హాస్పిటల్ కి తీసుకెళ్లారు. వెంకటేష్ భార్య స్రవంతి అతను తొందరగా కోలుకొని ఆరోగ్యంగా ఉండాలని చాలా ఆస్పత్రులకు తీసుకెళ్ళింది అయినా ఫలితం లేదు. అతను మల్లారెడ్డి హాస్పిటల్ నుంచి ఇంటికి వెళ్ళాక ఒక మూడు రోజుల్లో ఇంటిదగ్గర చనిపోవడం జరిగింది. కార్మికుడి భార్య స్రవంతి పలుమార్లు కంపెనీ యాజమాన్యంను నష్ట పరిహారం అడిగినా స్రవంతి కుటుంబం పట్ల నిర్లక్ష్యం వహిస్తూ తనను ఏదో రకంగా కంపెనీ యజమాన్యం పట్టించుకోవడం లేదు అని తెలుసుకొని అడిగి విసుగు చెందిన స్రవంతి కుటుంబ సభ్యులకి ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే కార్మికులకు న్యాయం చేస్తారని తోటి కార్మిక మిత్రుల ద్వారా తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి గురించి తెలుసుకొని తన కార్యాలయం వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించాడు.వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి హుటాహుటిన ఎం గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వద్దకు బయలుదేరి యజమాన్యంతో పలుమార్లు చర్చించి చనిపోయిన కార్మికుని కుటుంబానికి రావలసిన నష్టపరిహారం హాస్పటల్ ఖర్చులు మూడు లక్షల రూపాయలు, అలాగే చనిపోయిన కుటుంబ సభ్యుల భార్యా పిల్లలకి (6,50,000) రూపాయలు, మొత్తం కలిపి (9,50,000) రూపాయలు, చనిపోయిన కార్మికుని కుటుంబానికి చెక్కు రూపంలో అందజేశారు. కార్మికుని కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మా కుటుంబానికి న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, పాల్గొన్నారు.

# శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసిన ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్, నవంబర్ 17 ( నమస్తే హైదరాబాద్):** ఉప్పల్ విజయపురి కాలనీలో లావణ్య ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అలాగే లక్కీ డ్రా లో విజేతలు కుట్టు మిషన్లు ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళల కోసం అనేక పథకాలను అమలు చేస్తోంది. ఇందులో ముఖ్యమైనవి, ఉచిత బస్సు ప్రయాణం ,మహాలక్ష్మి పథకం కింద 500 రూపాలు కే గ్యాస్ సిలిండర్ అందించే పథకం, మరియు చిన్న వ్యాపారాలు చేసే మహిళా పారిశ్రామికవేత్తలకు వడ్డీలేని రుణాలను అందించే ఉద్యోగిని పథకం వంటివి. అలాగే, మహిళా సాధికారత కోసం అనేక కార్యక్రమాలను చేపడుతోందని మహిళలు అన్ని రంగాలో రాణించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లావణ్య ఫౌండేషన్ ఫౌండర్ లావణ్య , ఉప్పల్ ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు అమరేశ్వరి , టీచర్స్ వాణి , మాధురి , సంధ్య విజయపురి కాలనీ అధ్యక్షుడు లింగారెడ్డి , సల్ల ప్రభాకర్ రెడ్డి, సుంకు శేఖర్ రెడ్డి, రాములు,బొడిగె మల్లేష్, అన్వర్ భాష తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి ఏపీకి ప్రధాని మోదీ..

**నమస్తే హైదరాబాద్** పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ వేడుకలకు భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్మ , ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ హాజరుకానున్నారు. వీవీఐపీల రాక సందర్భంగా ఏపీ పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఈ నెల 19వ తేదీన ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేరుకోనున్నారు. ఉదయం 8 గంటలకు విమానాశ్రాయానికి ప్రధాని రానున్నారు. విమానాశ్రయంలో ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ , మంత్రి నారా లోకేష్ ఘన స్వాగతం పలకనున్నారు. అక్కడి నుంచి ప్రధాని ప్రత్యేక కాన్వాయిలో ప్రశాంతి నిలయం చేరుకుంటారు. ప్రశాంతి నిలయం సాయి కుల్వంత్ సభ మందిరంలో జయంత్యుత్సవాల సందర్భంగా సత్యసాయిబాబా మహా సమాధిని మోదీ దర్శించుకుంటారు. అనంతరం హిల్ వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన శతజయంతి వేడుకల్లో పాల్గొని ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. మోదీతో కలిసి చంద్రబాబు, పవన్, నారా లోకేశ్‌తోపాటు జయంత్యుత్సవాల కమిటీ, ఏపీ మంత్రుల బృందం ఈ వేడుకల్లో పాల్గొంటారు. అదేవిధంగా 22వ తేదీన సత్యసాయి యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథి హోదాలో భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ హాజరవుతారు. బందోబస్తులో భాగంగా 2500 మంది పోలీసు బలగాలను



మోహరించింది ప్రభుత్వ యంత్రాంగం.

# తెలంగాణ సాహితీ శిఖరం, ప్రజల కవి అందెశ్రీ మరణం సాహితీ లోకానికి తీరని లోటు : నెమలి అనిల్ కుమార్








**ఉప్పల్, నవంబర్ 17 ( నమస్తే హైదరాబాద్):** తెలంగాణ ఉద్యమంలో తన అక్షరాన్ని ఇంధనంగా మార్చి ప్రజల్లో నిత్య చైతన్యాన్ని జ్వలింపచేసిన గొప్ప యోధుడు అందెశ్రీ అని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ అన్నారు,మల్లాపూర్ డివిజన్ నాగలక్ష్మి నగర్ కాలనీలోని శ్రీ సాయి విద్యానికేతన్ హై స్కూల్లో దళితరత్న డా. పీ.జీ. సుదర్శన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అందెశ్రీ సంస్మరణ సభలో నెమలి అనిల్ కుమార్ పాల్గొని అందెశ్రీ కి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో తన జైన శైలిలో పాటలు రాసి ఉద్యమానికి ఊపిరి పోసిన మహోన్నతుడు అందెశ్రీ అని కొనియాడారు. ఆయన మరణం తెలంగాణ సాహిత్య లోకానికి కాకుండా సబ్బండ వర్గాలకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కట్ట నాగరాజ్ ,అనంత రామ్ , సిహెచ్.మల్లేష్ ,సాయి సర్ ,రంగా రెడ్డి ,టి.నవీన్ గౌడ్ ,కోయలకొండ రాజేష్ ,కె.మహేష్ ,శ్రీనివాస్ రెడ్డి ,రవీందర్ రెడ్డి ,పి.ప్రసాద్ ,ఎం.రఘు ,యాదగిరి ,కె.సాయి గౌడ్ ,శివ ,చిన్ని ,గణేష్ ,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు వెలుగుగుట్ట చుట్టూ గిరి ప్రదక్షిణ: ఆలయ ఈ.వో. పెద్ది గారి శ్రీకాంత్



**ఉప్పల్, నవంబర్ 17 ( నమస్తే హైదరాబాద్):** కార్తీక మాసం సందర్భంగా ఉప్పల్ వెలుగుగుట్ట ఆలయం చుట్టూ స్వామి వారి ఊరేగింపు నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు, ఆలయ కార్య నిర్వహణాధికారి పెద్దిగారి శ్రీకాంత్, ఆలయ అర్చకులు కొమళ్లపల్లి ఫణీ శర్మ తెలిపారు. మంగళవారం మాస శివరాత్రి రోజున సాయంత్రం 6.00 గంటల నుండి వెలుగు గుట్ట చుట్టూ స్వామి వారి ఊరేగింపు, గిరి ప్రదక్షణ ఉ ంటుందని తెలిపారు. భక్తులు సాంప్రదాయ దుస్తులతో, పాదరక్షలు లేకుండా "ఓం నమః శివాయ" భగవన్ నామస్మరణతో చేయాలని సూచించారు. కార్తీక మాసం ఎంతో ప్రీతికరమైన ఈ పరమ పవిత్రమైనదని, ఈ కార్తీక మాసమున భక్తుల కొంగు బంగార మైన ఈ వెలుగు గుట్టకు గిరిప్రదక్షిణ చేస్తే భక్తుల కోరికలు నెరవేరు తాయని తెలిపారు.

భక్తులు ఈ మహత్కార్యంలో అధిక సంఖ్యలో పాల్గొని పరమేశ్వరుని కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు.భక్తులకు మనవి మీ అపార్ట్మెంట్ వద్దకు స్వామి వార్ల ఊరేగింపు వచ్చినపుడు మంగళ హారతులు పట్టవలసినదిగా కోరారు. అలాగే ప్రసాదములు నివేదించుకోవచ్చునని పేర్కొన్నారు.

# చిలుకానగర్ డివిజన్లో 56 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్

–సిసి రోడ్డు నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి : కార్పొరేటర్ బన్నాల





**ఉప్పల్, నవంబర్ 17 (నమస్తే హైదరాబాద్ ):** చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ సోమవారం జిహెచ్ఎంసి అధికారులు, బ్యాంక్ కాలనీ, రాఘవేంద్ర నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి సుమారు 56 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సిసి రోడ్ పనులను పర్యవేక్షించారు. అనంతరం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ సమయంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షణ తప్పకుండా ఉండాలని, కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా అన్ని చర్యలు చేపట్టాలని, కాలనీలో ఉండే ప్రజలకు నిర్మాణ సమయంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలని, నాణ్యత ప్రమాణాల లో ఎటువంటి జాప్యం జరిగిన కఠిన చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఈ.ఈ. హరిలాల్ , డి ఈ వినీల్ గౌడ్, ఏ.ఈ.రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ కోకొండ, కోకొండ జగన్, పల్లె వేణు గౌడ్, బాలకృష్ణ గౌడ్, శ్యామ్, బంటి గౌడ్, చిన్న,బ్యాంక్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు గఫూర్ , జిఎస్. సందీప్ భూషణ్, వెంకటేశ్వరరావు, బాలా గౌడ్, రాఘవేంద్ర నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, సభ్యులు రవి వర్మ, కృష్ణారెడ్డి, వి బి ఎస్ కె. భాస్కరరావు, సత్యనారాయణ, గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


# కార్పొరేటర్ బొంతు శ్రీదేవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి



**ఉప్పల్, నవంబర్ 17 ( నమస్తే హైదరాబాద్):** హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ సతీమణి, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి దంపతులను ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. బొంతు రామ్మోహన్ దంపతులు ఆయురారోగ్యాలతో విలసిల్లాలని ఆకాంక్షిస్తూ బొంతు శ్రీదేవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# మాజీ ఎంపిటిసి రావుల రజిత చిత్ర పటానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**నమస్తే హైదరాబాద్ (ధర్మసాగర్):** ధర్మసాగర్ మాజీ ఎంపిటిసి రావుల రజిత దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై ఆమె చిత్ర పటానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు చోరీ నిరసన లో పాల్గొన్న ఆకారపు అరుణ్ పటేల్



**ఉప్పల్, నవంబర్ 17 ( నమస్తే హైదరాబాద్):** జాతీయ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ భాను చీబ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ల ఆధ్వర్యంలో సోమవారం గాంధీ భవన్ లో నిర్వహించున ఓటు చోరీ నిరసన కార్యక్రమం లో ఉప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకారపు అరుణ్ పటేల్ మాట్లాడుతూ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన ఓటు చోరీ కార్యక్రమానికి మద్దతుగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఊట్లచూరిని అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. నిరసన చేపట్టిన యూత్ కాంగ్రెస్ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఓట్ చోరీ నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడతామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో యూత్ కాంగ్రెస్ నాయకులు వాసు, సచిన్, జయంత్, ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి వినేష్, పాషా,భాను, భాస్కర్, నాని, శివ, అజీమ్, ఇంతియాజ్, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సౌదీ బస్సు ప్రమాదంపై స్పందించిన పవన్ కళ్యాణ్



సౌదీ అరేబియాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో తెలంగాణకు చెందిన పలువురు ఉమ్రా యాత్రికులు మరణించడం పట్ల మంత్రి పవన్ కళ్యాణ్ స్పందించారు. అయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా...... మదీనా సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో 42 మంది భారతీయులు మరణించడం హృదయ విదారకమని అన్నారు. మృతుల్లో ఎక్కువ మంది హైదరాబాద్ వాసులు కావడం బాధాకరమని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని తెలిపారు.

## కార్పొరేటర్ బొంతు శ్రీదేవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఆకారపు అరుణ్ పటేల్



**ఉప్పల్, నవంబర్ 17 ( నమస్తే హైదరాబాద్):** జిహెచ్ఎంసి చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ని ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు జయంత్, వాసు, దినేష్, ప్రశాంత్, సచిన్ లు మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# విశాఖ ఉక్కుపై ప్రభుత్వం కీలక ప్రకటన



**నమస్తే హైదరాబాద్ :** విశాఖ ఉక్కు పరిశ్రమపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ సంస్థను ప్రైవేటైజేషన్ చేయడం లేదని.. ప్రగతి వైపు ప్రస్థానం సాగిస్తుందని స్పష్టం చేసింది. ఎన్డీయే ప్రభుత్వ సహకారంతో వైజాగ్ స్టీల్ ప్లాంట్ బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 17 నెలల్లో ఉక్కు పరిశ్రమకు రూ.15 వేల కోట్ల సాయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించినట్లు తెలిపింది. ఇక ఓవరాల్ కెపాసిటీ యుటిలైజేషన్‌ను 17 నెలల్లో 48 నుంచి 79 శాతానికి పెంచినట్లు సోదాహరణగా వివరించింది. దేశంలో మరే పబ్లిక్ సెక్టార్ కంపెనీకీ ఇవ్వని స్థాయిలో ప్రభుత్వాలు ఈ ఆర్థిక సాయం అందించినట్లు ప్రకటించిం ది.విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఇటీవల ఒక సర్క్యులర్ జారీ చేసింది. ఇది కార్మికుల్లో ఆందోళనకు కారణమైనట్లు తెలుస్తోంది. ఉత్పత్తికి అనుగుణంగానే జీతాలు చెల్లిస్తామని ఆ సర్క్యులర్‌లో యాజమాన్యం పేర్కొన్నట్లు కార్మిక సంఘాలు చెబుతున్నాయి. దీని వల్ల నష్టపోతామని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. దాంతో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు (సోమవారం) ఉక్కు కార్యాలయం ముట్టడికి కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసేది లేదని సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. తాజాగా విశాఖ ఉక్కు యాజ మాన్యం తీసుకొచ్చిన ఆదేశాలతో ప్రస్తుతం ఈ వివాదం రేగింది. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో తమందరికీ యాజమాన్యం పూర్తి జీతాలు అందజేసిందని కార్మిక సంఘాలు చెబుతు న్నాయి.నవంబర్ నుంచి మాత్రం అందు కు భిన్నంగా జీతాలు చెల్లింపు ఉంటుందని యాజ మాన్యం చెబుతోందని కార్మిక సంఘాలు అంటు న్నాయి. ఉత్పత్తికి అనుగుణంగానే జీతాల చెల్లిం పులు ఉంటాయని సంస్థ జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేయడంపై వారంతా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నిర్ణీత లక్ష్యానికి అనుగుణంగా 100 శాతం ఉత్పత్తి జరిగితేనే 100 శాతం జీతాలు ఇస్తామని యాజమాన్యం ఉత్తర్వుల్లో పేర్కొందని చెబుతున్నారు.దాని వల్ల తాము నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు కార్మికులు. ముడి పదార్థాలు సరిగ్గా అందుబాటులో లేవని.. తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. దీని వల్ల లక్షిత ఉత్పత్తి సాధించడం సాధ్యం కావడం లేదని చెబుతు న్నారు. ముడి సరకు అందుబాటులో ఉండి.. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఉంటే.. ఉత్పత్తి సాధ్యమవుతుందని కార్మిక సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. అలాంటి వేళ.. ప్రభుత్వం విశాఖ ఉక్కుపై కీలక ప్రకటన చేసినట్లు తెలుస్తోంది.

## సతీష్ మరణంపై శాలివాహన కుమ్మర సంఘం సంచలన వ్యాఖ్యలు



తిరుపతి, నవంబర్ 17: పరకామణి కేసులో కీలక వ్యక్తిగా ఉంటూ మృతి చెందిన సతీష్ మరణంపై శాలివాహన కుమ్మర సంక్షేమ సంఘం స్పందించింది. సతీష్ కుమార్ వాంగ్మూలం ద్వారా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని భయపడిన కొంతమంది వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించాలని చూస్తున్నారని ఆరోపించింది. పోలీసు వ్యవస్థలో కీలకమైన పదవిలో ఉన్నటువంటి ఒక అధికారిని అత్యంత కరంగా హతమార్చినా ఇప్పటి వరకు ఇందులో ముద్దాయిలను అరెస్టు చేయకపోవడం దారుణమని మండిపడింది.సతీష్ కుమార్ మృతికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని అతడి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. ఇంటి నుంచి బయలుదేరేటప్పుడు గానీ, గుంతకల్ రైల్వే స్టేషన్‌లో స్కూటర్ పార్కింగ్ చేసేటప్పుడు గానీ ఎలాంటి అనుమానాస్పద ప్రవర్తన గానీ, భయభ్రాంతులకు గురైనట్టుగాని కనిపించలేదని పేర్కొంది. ఎన్నో క్లిష్టమైన కేసులను కూడా సునాయాసంగా పరిష్కరించిన ప్రతిభావంతుడు, ధైర్యశాలి ఆత్మహత్యకు పాల్పడేంత పిరికివాడు కాదని తెలిపింది.ఆత్మహత్య అయితే అందుకు గల కారణాలను తనపై అధికారులకు లేదా.. న్యాయమూర్తులకు సతీష్ తెలపలేదని పేర్కొంది సంఘటన జరిగిన చోట, ఆయన దుస్తుల్లో ఎలాంటి సూసైడ్ నోటు లభించలేదని తెలిపింది. ఒక పోలీస్ అధికారి అయ్యుండి సూసైడ్ నోటు రాయకుండా, తన కుటుంబ సభ్యుల గురించి ఏమాత్రం ఆలోచించకుండా చనిపోయే అవివేకి కాదని కుమ్మర సంక్షేమ సంఘం వ్యాఖ్యానించింది.

# అద్దంకిలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న మంత్రులు



**నమస్తే హైదరాబాద్ :** పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, కలిసి సోమవారం ప్రారంభించారు. మంత్రులు పలు ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. తొలుత ద్వారకా నగర్ లో రూ.4.60 కోట్లతో నిర్మించిన 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రాన్ని మంత్రులు, కలెక్టర్ కలిసి ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం మొక్కలు నాటారు. పట్టణంలో రూ.7.25 కోట్లతో సిసి రహదారులు, సైడ్ కాల్వల నిర్మాణ పనులకు విద్యుత్, పట్టణ పురపాలక శాఖ మంత్రులు కలిసి శంకుస్థాపన చేశారు. తదుపరి పసుమర్తిపాలెంలో రూ.15 లక్షల నిధులతో నిర్మించిన సామాజిక భవనాన్ని, శ్రీ ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల కొరకు రూ.25 లక్షలతో నిర్మించిన డైనింగ్ హాల్ ను ప్రారంభించారు. అసిస్ట్, ఎన్ఆర్ఈ డిసిఏపి సంస్థల సహకారంతో 230 సైకిళ్లను విద్యార్థుని విద్యార్థులకు మంత్రులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం 60 మంది నిరుపేదలకు ఇంటి నివాస స్థలాల పట్టాలను మున్సిపల్ కార్యాలయంలో అందజేశారు. మెప్మా ఆధ్వర్యంలో ఎల్ హెచ్ పి సెల్ కింద రూ.50 లక్షల నిధులను 60 డ్వాక్రా సంఘాలకు మంత్రులు కలిసి పంపిణీ చేశారు.కూటమి ప్రభుత్వ పాలనలో శరవేగంగా అభివృద్ధి జరుగుతోందని మంత్రి రవికుమార్ చెప్పారు. అద్దంకి నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీల కాలనీలలో రహదారులు, కాల్వల నిర్మాణానికి రూ.3.5 కోట్లతో పనులు ప్రారంభించామన్నారు. అద్దంకి పట్టణానికి ట్రాఫిక్ సమస్య లేకుండా నూతన బైపాస్ ఏర్పాటుకు రూ.18 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు. అలాగే చెరువు కట్ట అభివృద్ధికి నిధులు కేటాయించాలని పట్టణ అభివృద్ధి శాఖ మంత్రిని కోరారు. చెరువు కట్టపై నివాసం ఉంటున్న వారందరికీ ఇంటి నివాస స్థలాలు పంపిణీ చేస్తున్నామని, వారి ఇళ్ల నిర్మాణానికి ఒక్కొక్కరికి రూ.2.50 లక్షల నిధులు ఇస్తామన్నారు. వారికి ఇచ్చిన కేటాయించిన ప్రాంతంలో నివాసయోగ్యంగా రహదారులు, విద్యుత్, తాగునీరు, కాల్వలు వంటి అన్ని సదుపాయాలు త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. టిడ్కో గృహాలు 90 శాతం పూర్తికాగా, పెండింగ్ లో ఉన్న రూ.50 కోట్లతో పూర్తి చేయించి త్వరలోనే గృహ ప్రవేశాలు చేపిస్తామన్నారు. పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కొన్ని పనులకు శంకుస్థాపన చేయగా, మరి కొన్ని పనులు పూర్తిచేసి ప్రారంభించామన్నారు. అద్దంకి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి, అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టిడ్కో గృహాలను రానున్న ఏడాది జూన్ లో పూర్తిచేసి ప్రారంభిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. పేద ప్రజలందరి కలలు సహకారం చేస్తామన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉండడంతో ఆర్థిక సమస్యలు తలెత్తాయని, రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవ నారా చంద్రబాబు నాయుడు తన అనుభవ జ్ఞానంతో సమర్థంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారని వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను సమర్ధంగా అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో చెత్త కుప్పలు 85 లక్షల టన్నులు ఇప్పటికే తొలగించామని, త్వరలో అన్నిటిని తొలగించి పర్యావరణ పరిరక్షించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణ అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. అద్దంకి పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి అమృత్ పథకం కింద రూ.110 కోట్ల నిధులు మంజూరు చేస్తామన్నారు. ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్లు ఇచ్చి సురక్షిత తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. ఈ పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. రూ.6 కోట్ల నిధులతో అద్దంకి పట్టణ చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. బైపాస్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనను పరిశీలించి త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు.


ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖర్, విద్యుత్ శాఖ ఎస్ఈ ఆంజనేయులు, మెప్మా పీడీ సత్య ఆనంద్ పాల్, అద్దంకి మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్, తదితరులు పాల్గొన్నారు.

# అస్సాంలో ఎస్ఐఆర్ విధానం లేదు: ఎన్నికల కమిషన్ ప్రకటన




**నమస్తే హైదరాబాద్ :** భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) అస్సాంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి సోమవారం ఆదేశించింది.వచ్చే సంవత్సరం అస్సాం అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, రాష్ట్రంలోని జాతీయ పౌరుల పట్టిక ప్రాసెస్ ఇంకా పెండింగ్‌లో ఉండడం వల్ల, అస్సాంలో పూర్తి ఎస్ఐఆర్ నిర్వహించబడడం లేదు. కేవలం ప్రత్యేక సవరణ ప్రక్రియ మాత్రమే జరుగుతుంది.అస్సాంలో 3.3 కోట్ల దరఖాస్తుదారుల జాబితా నుండి 2019 ఎన్ఆర్సి జాబితాలో దాదాపు 19.6 లక్షల మంది వ్యక్తులు మినహాయింపబడ్డారు. తుది నోటిఫికేషన్ ఇప్పటివరకు వెలువడలేదు. అయితే, అస్సాం ప్రభుత్వం ప్రస్తుత ఎన్ఆర్సి జాబితాను సుప్రీంకోర్టులో సవాలు చేసింది.ఇసి గత నెలలో ప్రకటించిన ప్రకారం, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, పుదుచ్చేరి, అండమాన్, నికోబార్ దీవులు, లక్షద్వీప్‌లలో ఎస్ఐఆర్ చేపట్టబడుతుంది. వీటిలో తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పశ్చిమబెంగాల్‌లో 2026లో ఎన్నికలు జరగనున్నాయి. 2026లో ఎన్నికలు జరగనున్న అస్సాంకు ప్రత్యేక ఎస్ఐఆర్ ప్రక్రియను కొనసాగించనున్నారు.సీనియర్ ఇసి అధికారుల ప్రకారం, సాధారణ వార్షిక ప్రత్యేక కూలంక్షన్ సవరణ తో పోలిస్తే, అస్సాంలో ప్రత్యేక సవరణలో మరింత విపులమైన స్క్రూటినీ ఉంటుంది. ఈ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి సమాచారం సేకరిస్తారు. కానీ ఎస్ఐఆర్‌లో జరిగినట్లుగా ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేయవలసిన అవసరం లేదు. బదులుగా, ల వద్ద అనే మూడు ఫారాలున్నాయి అని సోమవారం ఇసి ఉత్తర్వులో పేర్కొన్నది.

# సౌదీ బస్సు ప్రమాదంలో ప్రాణాలతో బయటపడ్డ ఒకే ఒక్కడు



పవిత్ర ఉమ్రా యాత్ర ముగించుకొని తిరిగి వస్తున్న భక్తులను మృత్యువు కబళించింది. సౌదీ అరేబియాలోని మదీనా సమీపంలో ఒక ప్యాసింజర్ బస్సు డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో సంభవించిన ఘోర ప్రమాదంలో దాదాపు 45 మంది మరణించినట్లు నివేదికలు తెలుపుతున్నాయి. మృతుల్లో దాదాపు 42 మంది భారతీయ పౌరులు ఉన్నట్లు సౌదీ స్థానిక మీడియా వెల్లడించింది. అలాగే ఈ ప్రమాదం నుంచి ఒకే ఒక్క వ్యక్తి ప్రాణాలతో బయటపడినట్లు తెలుస్తోంది. మరి అతడు ఎవరో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

ఈ హృదయ విదారక ఘటన మక్కా నుంచి మదీనాకు వెళ్లే మార్గంలో.. ముఫ్రిహత్ సమీపంలో తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో అనేక మంది యాత్రికులు నిద్రిస్తున్న కారణంగా.. బస్సు మంటల్లో చిక్కుకున్నప్పుడు వారు తప్పించుకోలేకపోయారు. అయితే మృతుల్లో అధిక శాతం మంది తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు చెందినవారే కావడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. గల్ఫ్ న్యూస్ ప్రకారం.. మృతుల్లో కనీసం 11 మంది మహిళలు మరియు 10 మంది చిన్నారులు ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రమాదం జరిగిన తీరు భయానకంగా ఉందని.. బస్సు పూర్తిగా కాలిపోవడంతో మృతదేహాలను గుర్తించడం కష్టతరంగా మారిందని సహాయక బృందాలు తెలిపాయి. ఈ ప్రమాదంలో కేవలం ఒక వ్యక్తి మొహమ్మద్ అబ్దుల్ షోయబ్ ప్రాణాలతో బయటపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. అయితే ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందనేది మాత్రం ఇంకా తెలియరాలేదు. హైదరాబాద్‌కు చెందిన 'అల్-మీనా హజ్ అండ్ ఉమ్రా ట్రావెల్స్' ఏజెన్సీల ద్వారా ప్రయాణించిన సుమారు 16 మంది యాత్రికులు ఈ మృతుల్లో ఉన్నట్లు సమాచారం. అయితే వీరంతా హైదరాబాదీలే. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర సంతాపం తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ.. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. "రియాద్‌లోని మా రాయబార కార్యాలయం మరియు జెడ్డాలోని కాన్సులేట్ అన్ని విధాలా సహాయం అందిస్తున్నాయి. మా అధికారులు సౌదీ అరేబియా అధికారులతో నిరంతరం సంప్రదింపుల్లో ఉన్నారు" అని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా ఈ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ.. భారతీయ పౌరులకు పూర్తి మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు.

## టీటీడీ పరకామణిలో రూ.100 కోట్ల చోరీ జరిగిందన్న మంత్రి పార్థసారథి




**నమస్తే హైదరాబాద్ :** తిరుమల తిరుపతి దేవస్థానం పరకామణిలో జరిగిన రూ.100 కోట్ల విదేశీ కరెన్సీ చోరీ కేసులో దొంగలు దొరికిపోతారనే భయంతోనే నాటి విజిలెన్స్ అధికారి సతీష్ కుమార్‌ను అంతమొందించారని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, ప్రజా సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సంచలన ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమల పవిత్రతను మంటగలిపి, దోపిడీకి పాల్పడ్డారని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.కోట్లాది మంది భక్తులు ఎంతో పవిత్రంగా భావించే తిరుమల క్షేత్రంలో గత పాలకులు రాజకీయ కుట్రలకు, దోపిడీకి పాల్పడటం భక్తులను తీవ్రంగా కలిచివేసిందన్నారు. టీటీడీ పరకామణిలో ఏకంగా వంద కోట్ల రూపాయల విదేశీ కరెన్సీ చోరీ జరిగిందన్న వార్త ఆవేదనకు గురిచేసిందన్నారు. 2023 ఏప్రిల్ 29న నాటి విజిలెన్స్ అధికారి సతీష్ కుమార్ ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేశారని, అయితే ఇంత భారీ దోపిడీకి సాధారణ సెక్షన్లు నమోదు చేయడం వెనుక కుట్ర దాగి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. దోపిడీ ముఠా పనిలా ఈ వ్యవహారం నడిచిందన్నారు.ఈ కేసు దర్యాప్తు తీరు అనేక అనుమానాలకు తావిస్తోందని పార్థసారథి అన్నారు. కేసు పెట్టిన నెల రోజుల్లోపే, అంటే మే 31న ఛార్జ్‌షీట్ దాఖలు చేయడం, ఆ మరుసటి రోజే ఫిర్యాది సతీష్ కుమార్, నిందితుడు రవికుమార్ కలిసి కోర్టులో రాజీ మెమో దాఖలు చేయడం వెనుక ఎవరి ఒత్తిడి ఉందో తేలాలన్నారు. రూ.100 కోట్ల దోపిడీకి బదులుగా నిందితుడు రూ.14.5 కోట్ల ఆస్తులను టీటీడీకి 'దానం' చేసినట్లు చూపించి కేసును నీరుగార్చారని ఆరోపించారు. ఉన్నతాధికారుల ఒత్తిడితోనే సతీష్ కుమార్ రాజీకి అంగీకరించినట్లు విజిలెన్స్ నివేదికలు చెబుతున్నాయని పేర్కొన్నారు.ఈ కేసులో కీలక సాక్షిగా ఉన్న సతీష్ కుమార్ అనుమానాస్పద మృతి వెనుక పెద్ద కుట్ర ఉందని పార్థసారథి అన్నారు. వైఎస్ వివేకానంద రెడ్డి హత్యను గుండెపోటుగా చిత్రీకరించినట్లే, సతీష్ కుమార్ మరణాన్ని కూడా ఆత్మహత్యగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సతీష్ సోదరుడు ఇది హత్యేనని చెబుతున్నా, పోలీసుల కంటే ముందే టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆత్మహత్యగా ప్రకటించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. రాజీ వ్యవహారం కూడా భూమన ఛైర్మన్ అయిన నెల రోజుల్లోనే జరగడంపై లోతైన దర్యాప్తు అవసరమన్నారు.గతంలో పరిటాల రవి, వివేకానంద రెడ్డి హత్య కేసుల్లో సాక్షులు చనిపోయినట్లే, ఈ కేసులోనూ సాక్షులను లేకుండా చేసే కుట్ర జరుగుతోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తును వ్యతిరేకించిన వైసీపీ నేతలు, ఇప్పుడు ఈ కేసులో సీబీఐ విచారణ కోరడం వాస్తవాలను నీరుగార్చే ప్రయత్నమేనని విమర్శించారు. గత ప్రభుత్వానికి తిరుమల శ్రీవారిపై భక్తి, గౌరవం లేవని, పవిత్ర క్షేత్రాన్ని దోచుకోవడానికి ఒక అవకాశంగా మాత్రమే చూశారని పార్థసారథి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులో దోషులు ఎంతటి వారైనా సరే, వారిని చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షిస్తామని ప్రభుత్వం తరపున ఆయన హామీ ఇచ్చారు.

## నవంబర్ 19న అన్నదాత సుఖీభవ రెండో విడత నిధుల జమ



ఆంధ్రప్రదేశ్‌లోని రైతులకు శుభవార్త. అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధులు విడుదలపై క్లారిటీ వచ్చింది. నవంబర్ 19న అన్నదాత సుఖీభవ రెండో విడత డబ్బులు రైతుల బ్యాంక్ ఖాతాల్లో ఏపీ ప్రభుత్వం జమ చేయనుంది. వైఎస్సార్ కడప జిల్లా కమలాపురంలో జరిగే కార్యక్రమంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత డబ్బులు విడుదల చేస్తారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎం కిసాన్ యోజన తో కలిపి ఈ పథకాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. పీఎం కిసాన్ యోజన 21వ విడత నిధులు నవంబర్ 19న ప్రధాని మోదీ విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు సైతం అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు ఆ రోజే విడుదల చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.5 వేలకు.. కేంద్ర ప్రభుత్వం అందించే రూ.2 వేలు కలిపి.. మొత్తం రూ.7 వేల రూపాయలను రైతుల బ్యాంక్ ఖాతాల్లో నవంబర్ 19న జమ చేయనున్నారు. ఆగస్ట్ నెల ప్రారంభంలో మొదటి విడత నిధులు విడుదల చేసిన సంగతి తెలిసిందే.

మరోవైపు 46 లక్షల మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో అన్నదాత సుఖీభవ డబ్బులు జమ చేయనున్నారు. ఈ నేపథ్యంలో అన్నదాత సుఖీభవ పథకం స్టేటస్ చెక్ చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ఇందుకోసం రైతుల https://annadatha sukhibhava. ap.gov.in/వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. ఇందులో అనే ఆప్షన్ మీద క్లిక్ చేయాలి. అప్పుడు ఆధార్ కార్డు నంబర్ వివరాలు అడుగుతుంది. ఆధార్ కార్డు నంబరు ఎంటర్, కాప్చా నమోదు చేసిన తర్వాత.. ఆ పక్కనే ఉన్న సెర్చ్ బటన్ నొక్కాలి.అనంతరం అర్హుల వివరాలు కనిపిస్తాయి. రైతు పేరుతో పాటుగా జిల్లా, మండలం, గ్రామం వివరాలు తెలుస్తాయి. అలాగే పథకం స్టేటస్ తెలుస్తుంది. ఈ కేవైసీ ప్రక్రియ పూర్తి అయ్యిందా, చేయించుకోవాలా అనే వివరాలు కూడా అందుబాటులో ఉంటాయి. వీటితో పాటుగా అన్నదాత సుఖీభవ తొలి విడత డబ్బులు పడ్డాయా లేదా అనే వివరాలతో పాటుగా ఏ బ్యాంక్ అకౌంట్లోకి పడ్డాయనే వివరాలు కూడా తెలిసేలా అధికారులు అవకాశం కల్పించారు. మరోవైపు పీఎం కిసాన్ యోజనతో కలిసి అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా తొలివిడత రూ.7000, రెండో విడత రూ.7000, మూడో విడత కింద రూ.6000 అర్హులైన రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తారు.

# రెండో పంటకు నీళ్లు ఇవ్వాలని రైతులు నిరసన..

### రైతులకు భరోసాగా ఉప్పాల రాము..










**నమస్తే హైదరాబాద్ :** కృష్ణాజిల్లా పెడన నియోజవర్గం పెందుర్రు అడ్డరోడ్ నుంచి బంటుమిల్లి ఎమ్మార్వో కార్యాలయం వరకు శాంతియుత నిరసన చేపట్టిన రైతులు...దాల్వాలేదని విడుదల చేసిన జీవోను వెనక్కి తీసుకోవాలి ఉప్పాల రాము...
బంటుమిల్లి మరియు కృత్తివెన్ను మండలాల్లోని రైతులు గత కొన్ని సంవత్సరాలుగా ఖరీఫ్ పంటగా వరిని మాత్రమే సాగు చేస్తూ రబీ సమయంలో అపరాలను సాగు చేస్తున్నారు కానీ ఖరీఫ్ సీజన్లో సాగు చేస్తున్న వరికి సరైన దిగుబడి లేక రైతులు నష్టపోతున్నారు.

కృత్తివెన్ను బంటుమిల్లి మండలాలు సముద్రతీరానికి దగ్గరగా ఉండటం వల్ల వ్యవసాయ భూములన్ని ఉప్పునీటి ప్రభావం వల్ల చౌడు భారీ పోతున్నాయి దానివల్ల పంట దిగుబడిపై తీవ్రమైన ప్రభావం పడుతుంది.

ఈ రెండు మండలాలకు ఖరీఫ్ మరియు రబీ సీజన్లో వరి పంట వేయడం వల్ల భూమిలో ఉప్పునీటి శాతం తగ్గి పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంది కానీ ఆ దిశగా ప్రభుత్వం రబీ సీజన్లో వరి పంట వేయడానికి నీటిని విడుదల చేయకపోవడం వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు వారి సమస్యని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి మరియు జిల్లా కలెక్టర్ దృష్టికి జిల్లా వ్యవసాయ అధికారులకు తెలియజేసినను వారు సరైన నిర్ణయం తీసుకోకుండా ఈ సంవత్సరం కూడా అపరాలను సాగు చేయాలని ఆదేశించడం ఆదేశించడం జరిగింది. రైతులు చేస్తున్న ఈ నిరసన కార్యక్రమానికి వైఎస్ఆర్సిపి పార్టీ సమన్వయకర్త ఉప్పల రాము ఒక రైతు బిడ్డగా రైతుల తరఫున పోరాటం చేయడానికి సంఘీభావంగా రావడం జరిగింది.ఈ కార్యక్రమంలో పెడన నియోజవర్గ రైతులు రైతు సంఘాల నాయకులు వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు కార్యకర్తలు వివిధ రాజకీయ పార్టీ నాయకులు మరియు సామాజిక సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొని రైతులకు న్యాయం జరిగేలా చేయాలని దాల్వా పంటకు దాల్వా పంటకు నీరు విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ని కోరడం జరిగింది..

# దొంగ పట్టాల పేరుతో మచిలీపట్నం ప్రజలను మోసం చేసిన ఘనత పేర్ని కుటుంబానికే దక్కుతుంది.

**మంత్రి కొల్లు రవీంద్రను విమర్శించే నైతిక హక్కు పేర్ని కుటుంబానికి లేదు.**

**మచిలీపట్నం అభివృద్ధికి అడ్డుపడే పేర్ని కుటుంబం విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది. పలువురు టిడిపి నాయకులు పేర్ని నాని కుటుంబం పై మండిపడ్డారు..**



**నమస్తే హైదరాబాద్ :** బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్, తెలుగుదేశం పార్టీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు, లోగిశెట్టి వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి, బచ్చుల అనిల్ కుమార్ మచిలీపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశం వివరాలు.. సెంటు పట్టాల పేరుతో ఎక్కడో మునిగిపోయే చోట పట్టాలు ఇచ్చి కరెంటు లేకుండా, మెర క చేయించకుండా ఇల్లు కట్టించి ఇవ్వకుండా ప్రజలను మోసం చేసింది పేర్ని నాని కాదా అని ప్రశ్నించారు.

సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించిన గత వైసిపి ప్రభుత్వం లో ఇల్లు కట్టుకోమని వారికి ప్రభుత్వం ద్వారా డబ్బులు రాకుండా చేస్తే, వారు అప్పుల పాలై ఇల్లు కట్టుకుని ఎన్నో ఆర్థిక ఇబ్బందులు పడితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అటువంటివారిని గుర్తించి మంత్రి కొల్లు రవీంద్ర వారికి ప్రభుత్వం ద్వారా వచ్చే బకాయిలను ఇప్పించి, ఆ ఇళ్లను పూర్తి చేసి అధికారులతో గృహప్రవేశాలు చేయించితే, బుడ్డోడి పాత్ర పోషించే కిట్టు ఆ ఇళ్లకు వెళ్లి వారిని మభ్యపెట్టి ఏవేవో పిచ్చిప్రాలాపనలు చేయడం చూస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని విమర్శించారు. తన తండ్రి పేర్ని నాని అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు పేర్ని కిట్టు ఎందుకు డబ్బులు ఇప్పించలేకపోయా రో లబ్ధిదారులకు సమాధానం చెప్పగలరా అని ప్రశ్నించారు. పేర్ని కిట్టుకు మంత్రి కొల్లు రవీంద్రను విమర్శించే నైతిక హక్కు లేదని, తన తండ్రి పేర్ని నాని ఇచ్చిన దొంగ పట్టాల ద్వారా ప్రజలు మంత్రి కొల్లు రవీంద్ర కు 50 వేల పైచిలుకు మెజార్టీ ఇచ్చిన విషయాన్ని పేర్ని కిట్టు తెలుసుకోవాలని సూచించారు.మచిలీపట్నం అభివృద్ధికి అడ్డుపడుతున్నది పేర్ని కుటుంబం కాదా అని ప్రశ్నించారు. పేర్ని కుటుంబం మచిలీపట్నం నగర కార్పొరేషన్ లో బడ్జెట్ సమావేశాలు కూడా పెట్టకుండా ఏ విధంగా అభివృద్ధికి అడ్డుపడుతుందో ప్రజలు గ్రహిస్తున్నారని అన్నారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, పిన్నింటి అయ్యప్ప, వేమూరి పవన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# మహా మహిమాన్వితం గాయత్రి నామ స్మరణం

### – శోభాయమానంగా విశ్వ కళా భారతి వార్షికోత్సవం:



**నమస్తే హైదరాబాద్ :** 24 బీజాక్షరాలు గల గాయత్రి మహా మంత్రం అత్యంత మహా మహిమాన్విత మైనదని అష్టావధాని ఇలపావులూరి శేష శ్రీధర శర్మ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఒంగోలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విశ్వ కళా భారతి అధ్యక్షులు నాదెండ్ల జ్వాలా ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో జరిగింది , శేష శ్రీధర్ శర్మ మాట్లాడుతూగాయత్రి మంత్ర జపం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, గాయత్రిని విశ్వామిత్రుడు ఎలా దర్శించగలిగాడు, గాయత్రి 24 తత్వాలు వాటి ప్రయోజనాలు వంటి ఎన్నో అంశాలను శేష శ్రీధర్ శర్మ వివరించారు. అక్షర సాహితీ సమితి అధ్యక్షులు ఎం వి ఎస్ శాస్త్రి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. విశ్వ కళా భారతి సంస్థ అధ్యక్షులు నాదెండ్ల జ్వాలా ఉమా మహేశ్వర శర్మ చేస్తున్న సాహిత్య కృషిని వక్తలు అభినందించారు,ఎన్ వి సీతారామ శర్మ... ఉషశ్రీ జ్యోతి ప్రజ్వలన చేశారు, జిల్లా ఖజానా శాఖ అధికారి అన్నాపంతుల జగన్నాథ రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ జి వి శివా రెడ్డి , ఉప గ్రంథ పాలకురాలు కాళహస్తి సంపూర్ణ, తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ రావినూతల రామకృష్ణ ఆత్మీయ అతిథులుగా పాల్గొన్నారు, మార్తాటి ఈశ్వరీ గోపాల రావును విశ్వ కళా భారతి పురస్కారంతో ఘనంగా సత్కరించారు,, జిల్లా ఖజనా శాఖ అధికారి అన్నాపంతుల జగన్నాథ రావు...

# మీకోసం అర్జీలు సకాలంలో పరిష్కరించాలి - జిల్లా కలెక్టర్







**నమస్తే హైదరాబాద్ :** పిజిఆర్ఎస్ మీకోసం అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.

సోమవారం ఉదయం ఆయన మచిలీపట్నం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, డీఆర్ఓ కే చంద్రశేఖరరావు, అదనపు ఎస్పీ కే ఆర్ ఆర్ సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవితో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరించారు.

కార్యక్రమానికి ముందు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మీకోసం కార్యక్రమంలో ప్రజలు సమర్పించే అర్జీలను పరిష్కరించే విధానం, వాటిని ఆన్లైన్లో సమర్పించే ప్రక్రియపై అధికారులకు అవగాహన కల్పిస్తూ.. దీనిపై ఎన్నో సార్లు అవగాహన కల్పించినప్పటికీ పదే పదే అవే తప్పులు పునరావృతం అవటం పట్ల నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అవగాహన లేక చేసే తప్పులు వల్ల అర్జీలు రీఓపెన్ అవుతున్నాయని, అర్జీ ఎండార్స్మెంట్ చేసే విధానంపై సంబంధిత అధికారులు కిందిస్థాయి అధికారులకు తప్పనిసరిగా అవగాహన కల్పించాలని సూచించారు. అర్జీదారు లబ్ధి పొందితే తప్ప సిటిజెన్ బెనిఫిట్ డ్ ఆప్షన్ ఎంచుకోవద్దని, సమస్య ప్రభుత్వ పరిధిలో ఉంటే గనుక అదే అంశాన్ని అక్కడ తెలపాలని సూచించారు. వచ్చే సారి అవే తప్పులు పునరావృతం అయితే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ క్రమంలో ఆయన, కొంతమంది అధికారులు తప్పుగా చేసిన కొన్ని ఆన్లైన్ అర్జీల ఎండార్స్మెంట్లను స్క్రీన్ పై చూపించి మరోసారి అవగాహన కలిగించారు.

డిఆర్ఓ మాట్లాడుతూ ఐ గాట్ కర్మయోగి ఆన్లైన్ కోర్సులను పూర్తి చేయడంలో చాలా డిపార్ట్మెంట్లు వెనుకబడి ఉన్నాయని, త్వరితగతిన పూర్తి చేయించే విధంగా తమ సిబ్బందిని అప్రమత్తం చేయాలని సూచించారు. అర్జీలలో కొన్ని: తనకు కళాశాల చదువులు చదువుకుంటున్న ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారని, పిల్లల చదువుల కోసం బ్యాంకు ఖాతాలో దాచుకున్న నగదు పిల్లలకు అవగాహన లేక చేసిన పొరపాటుకు సైబర్ నేరగాళ్ల ద్వారా దాదాపు రూ.94 వేలు పోగొట్టుకున్నానని, తగిన న్యాయం చేసి ఆదుకోవాలని పామర్రు మండలం, పామర్రు గ్రామానికి చెందిన ఊసల అనిత అర్జీ ద్వారా కలెక్టర్కు విన్నవించుకున్నారు. దీనిపై స్పందించిన ఆయన పీ%-%4 కార్యక్రమం ద్వారా పిల్లల చదువులకు అవసరమైన సహాయానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. 2006లో నాగాయలంక మండలం, పెదపాలెం గ్రామంలో అప్పటి ప్రభుత్వం రెండు సెంట్లు చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని, అయితే ఇప్పటివరకు స్థలాలు చూపించలేదని, భూమి చూపిస్తే ఇళ్లు కట్టుకుంటామని గ్రామానికి చెందిన దాదాపు 20 మంది మహిళలు కలెక్టర్కు అర్జీ ద్వారా కోరారు. దీనిపై ఆయన సంబంధిత తహసిల్దారుతో ఫోన్ లో మాట్లాడిన అనంతరం, మంజూరు చేసిన భూమిలో జంగిల్ క్లియరెన్స్ చేయించి త్వరలో ఇళ్ళ స్థలాలు ఇస్తామని కలెక్టర్ వారికి భరోసా ఇచ్చారు. నివాసం ఉంటున్న ఇంటిని తన ఇద్దరు కుమారులు వారిద్దరి పేరున రిజిస్ట్రేషన్ చేయించుకుని, తమను ఇంటి నుంచి గెంటివేశారని, తమ బాగోగులు పట్టించుకోకుండా శారీరకంగా చిత్రహింసలకు గురిచేస్తూ భయబ్రాంతులకు గురిచేస్తున్నారని వృద్ధులైన భార్యాభర్తలు తమ గోడును వెళ్లబోసుకున్నారు. సదరు రిజిస్ట్రేషన్ రద్దు చేయించి తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని ఉయ్యూరు మండలం, కాటూరు గ్రామానికి చెందిన ఇందిరాసి సూరిబాబు, రామలక్ష్మీ అర్జీ సమర్పించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు శుభవార్త.. ఉత్తర్వులు జారీ




**నమస్తే హైదరాబాద్ :** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త వినిపించింది. స్పౌస్ గ్రౌండ్స్పై అంతర్ జిల్లాల బదిలీలకు ఏపీ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయ శాఖ సోమవారం జీవో జారీ చేసింది. తాజాగా మార్గదర్శకాల ప్రకారం ఈ బదిలీలు కేవలం రిక్వెస్ట్ బేసిస్ మీద మాత్రమే జరుగుతాయి. అలాగే బదిలీల కోసం దరఖాస్తు చేసుకునేవారు తమ దరఖాస్తులను ఆన్లైన్లో సమర్పించాల్సి ఉంటుంది. మరోవైపు భార్య లేదా భర్త ఇద్దరిలో ఒకరు ప్రభుత్వ ఉద్యోగి అయితేనే ట్రాన్స్ఫర్ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుంటారు. ప్రైవేట్ ఉద్యోగులు అయితే స్పౌస్ గ్రౌండ్స్ వర్తించదని మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు.


మరోవైపు నియామక యూనిట్ అయిన పాత జిల్లాలే ట్రాన్స్ఫర్ యూనిట్లుగా ఉంటాయి. మరోవైపు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల స్పౌస్ గ్రౌండ్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ట్రాన్స్ఫర్లకు.. డిసిప్లినరీ కేసులు ఉన్నవారికి అవకాశం లేదు. అలాగే ఏసీబీ లేదా విజిలెన్స్ కేసులు ఉన్నవారి అభ్యర్థనలను కూడా పరిగణనలోకి తీసుకోరు.

స్థానిక %వీూణూ% లేదా మున్సిపల్ కమిషనర్ నుంచి నోడ్యూస్ సర్టిఫికేట్ తప్పనిసరి. ఈ ట్రాన్స్ఫర్ల కోసం వివాహ ధ్రువీకరణ పత్రం, స్పౌస్ ఉద్యోగ ధ్రువీకరణ పత్రం, ఎంప్లాయి ఐడీ వంటి వివరాలు అందించాల్సి ఉంటుంది. అలాగే ఖాళీలు ఉన్నప్పుడు మాత్రమే ట్రాన్స్ఫర్కు అనుమతి ఇస్తారు. బదిలీల ప్రక్రియను నవంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

మరోవైపుగ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఇంటర్ డిస్ట్రిక్ట్ ట్రాన్స్ఫర్ ప్రక్రియ కోసం పలు నిబంధనలు ఉన్నాయి. ఖాళీ ఉన్నప్పుడు మాత్రమే ట్రాన్స్ఫర్ జరుగుతుంది. అలాగే ట్రాన్స్ఫర్ అయిన ఉద్యోగికి ఆ జిల్లాలో చివరి ర్యాంక్ కేటాయిస్తారు. మెరిట్ ఆధారంగా అభ్యర్థులను సీరియల్గా అమర్చుతారు. టై ఉంటే సర్వీస్ సీనియారిటీతో పాటుగా పుట్టినరోజును ప్రామాణికంగా తీసుకుంటారు. దరఖాస్తులను ఆన్లైన్లో సమర్పిస్తే.. ఎంపీడీవో సర్టిఫై చేస్తారు. తాత్కాలిక సీనియారిటీ జాబితాను పోర్టల్లో ఉంచుతారు. అభ్యంతరాలు ఉంటే ఆన్లైన్ ద్వారా అప్ లోడ్ చేయొచ్చు. వీటిని పరిశీలించిన అనంతరం హెచ్ఓడీలు సీనియారిటీ తుది జాబితాను పోర్టల్లో ఉంచుతారు.

# బెన్నవోలులో తెల్లసుద్ద మైనింగ్

**గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ**
**సమస్యలు తలెత్తుతాయని స్థానికుల ఆందోళన**
**వచ్చే ఏడాది నుంచి వైట్ క్లే తవ్వకాలు ప్రారంభం?**
**జీవనోపాధి కోల్పోతామని పలువురి ఆవేదన**



మండలంలోని బెన్నవోలు కొండపై సుదీర్ఘ విరామం తరువాత తెల్లసుద్ద క్వారీలో తవ్వకాలకు రంగం సిద్ధం అవుతున్నది. సిరామిక్ టైల్స్ తయారీలో ఉపయోగించే తెల్లసుద్ద (వైట్ క్లే) నిక్షేపాలు బెన్నవోలు గ్రామానికి ఆనుకుని ఉన్న కొండల్లో పుష్కలంగా ఉన్నాయి. గతంలో యానాంలో వున్న రీజెన్సీ సిరామిక్ పరిశ్రకు ఇక్కడి నుంచి వైట్ క్లేను తరలించారు. రీజెన్సీ ఇండస్ట్రీకి 2013 వరకు లీజు ఉండేది. అయితే కార్మికుల ఆందోళనల కారణంగా రీజెన్సీ సిరామిక్ పరిశ్రమ 2008లో మూతపడడంతో బెన్నవోలు కొండల్లో తెల్లసుద్ద తవ్వకాలు నిలిచిపోయాయి. మళ్లీ ఇప్పుడు వైట్ క్లే తవ్వకాలకు 'శ్రీలక్ష్మీ నరసింహ మెటల్స్ అండ్ శాండ్ ఇండస్ట్రీ' దరఖాస్తు చేసుకోగా, కాలుష్య నియంత్రణ అనుమతుల కోసం ఈ నెల 15న బెన్నవోలులో ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించారు. బెన్నవోలును ఆనుకుని ఉన్న 41.99 ఎకరాల్లో తెల్లసుద్దను తవ్వుకునేందుకు ఈ సంస్థకు అనుమతులు ఇవ్వనున్నారు. ఏడాదికి 3.6 లక్షల టన్నుల వైట్ క్లేను తవ్వి తరలించేందుకు ప్రభుత్వం అనుమతిస్తున్నది. టన్నుకు రూ.130 చొప్పున ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాల్సి వుంటుంది. నెలకు 30 వేల టన్నుల చొప్పున వైట్ క్లేను తవ్వుతారు. దీనిని 150 భారీ వాహనాల్లో రవాణా చేస్తారు. దీనివల్ల నీటి వనరులకు, పంట పొలాలకు ముప్పు వాటిల్లుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాభిప్రాయ సేకరణలో భిన్నస్వరాలు

బెన్నవోలు కొండపై వైట్ క్లే తవ్వకాల కోసం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో తవ్వకాలకు అనుకూలంగా కొందరు, వ్యతిరేకంగా మరికొందరు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వైట్ క్లే తవ్వకాల వల్ల కాలుష్య సమస్యలు ఉత్పన్నం అవుతాయని, పరిసరాల్లోని వ్యవసాయ భూములు నిర్జీవంగా మారతాయని అధికారుల ఎదుట తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మరికొందరు ఇక్కడ వైట్ క్లే తవ్వకాలు జరపవద్దని స్పష్టం చేశారు. స్థానికుల అభిప్రాయాలను పక్కనపెడితే ఇక్కడ వచ్చే ఏడాది నుంచే వైట్ క్లే తవ్వకాలు ప్రారంభం కావడం త?థ్యమని అధికారవర్గాల సమాచారం.

కొండను నమ్ముకుని దశాబ్దాలుగా ఉపాధి

బెన్నవోలు కొండపై లభించే తెల్లసుద్దను తవ్వుకుని అమ్ముకోవడం ద్వారా స్థానికంగా 12 కుటుంబాలు వారు జీవనోపాధి పొందుతున్నారు. తెల్లసుద్దను పిండి చేసి, ముగ్గుపిండిగా అమ్ముతుంటారు. ఇక్కడ మైనింగ్కు ప్రభుత్వం అనుమతులు ఇస్తే తాము ఉపాధి కోల్పోతామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా లీజు తీసుకోనున్న సంస్థ... ఇక్కడ ఉన్న కుటుంబాలు సుద్ద తవ్వుకునేందుకు అనుమతి ఇస్తామని చెబుతుండగా.. కొండ మొత్తం తవ్వుకుపోతే భవిష్యత్తులో తమకు ఏమీ మిగలదని అంటున్నారు.

ఉపాధిని దెబ్బతీయవద్దు

రంగాల దేవుళ్లు, రంగాల త్రినాథ్, బెన్నవోలు

తెల్లసుద్ద కొండను నమ్ముకుని ఎంతోకాలంగా జీవిస్తున్నాం. ఇక్కడ సుద్దను తవ్వుకుని, ఊరూరా తిరుగుతూ అమ్ముకుంటున్నాం. సంక్రాంతి పండుల సమయంలో ఆదాయం బాగుంటుంది. లీజుకు తీసుకున్న సంస్థ.. యంత్రాలతో తవ్వకాలు నిర్వహిస్తే ఉపాధి కోల్పోతాం. ప్రభుత్వమే మాకు న్యాయం చేయాలి

# త్రిశంకుస్వర్గంలో సీతపాలెం! ఎస్ఈజడ్ కోసం భూములు ఇచ్చిన రైతులు



**రెండు దశాబ్దాలు అయినా పునరావాసం కల్పించని ప్రభుత్వం**
**గ్రామాన్ని తరలించకుండా పరిశ్రమల ఏర్పాటు**
**ఫార్మా కంపెనీల కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి**
**రావిపాలెంలో ఇళ్ల స్థలాలు ఇస్తామంటున్న అధికారులు**
**దిబ్బపాలెం లేదా పంచదార్లలో కావాలంటున్న నిర్వాసితులు**
**ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.25 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్**

**నమస్తే హైదరాబాద్ :** ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజడ్) కోసం జీవనాధారమైన పంట భూములను ఇచ్చేశారు. చివరకు ఉన్న ఊరును కూడా త్యాగం చేయడానికి సిద్ధపడ్డారు. ఇది జరిగి సుమారు రెండు దశాబ్దాలు కావస్తున్నది. కానీ నాడు అధికారులు, పాలకులు ఇచ్చిన హామీలను ఇంతవరకు అమలు చేయలేదు. గ్రామానికి సమీపంలో ఏర్పాటైన పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద తమకు అనువైనచోట పునరావాస కాలనీ నిర్మించాలని కోరుతున్నా. అధికారులు పట్టించుకోవడంలేదు. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటైన ప్రత్యేక ఆర్థిక మండలి కోసం పలు గ్రామాల మాదిరిగానే రాంబిల్లి మండలం లాలంకోడూరు పంచాయతీ పరిధిలోని సీతపాలెంలో కూడా ఏపీఐఐసీ అధికారులు 230 ఎకరాలు సేకరించారు. అప్పట్లో నష్టపరిహారం కింద ఎకరాకు రూ.5.5 లక్షలు ఇచ్చారు. త్వరలో గ్రామాన్ని కూడా ఖాళీ చేయాలని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీని అమలు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఎస్ఈజడ్ కోసం ముందుగా గ్రామాలను ఖాళీ చేయాల్సిన వారికి దిబ్బపాలెం వద్ద పునరావాస కాలనీలో స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించారు. సీతపాలెం నిర్వాసితులకు కూడా దిబ్బపాలెం లేదంటే పంచదార్లలో ఆర్అండ్ఆర్ కాలనీ ఏర్పాటు చేసి, ఇళ్ల స్థలాలు ఇస్తామని, అందరికీ ఒకేచోట పునరావాసం కల్పిస్తామని అప్పట్లో అధికారులు హామీ ఇచ్చారు. కానీ కొంతకాలం తరువాత దిబ్బపాలెం/పంచదార్ల కాకుండా అచ్యుతాపురం మండలంలోని రావిపాలెంలో ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పారు. అయితే రావిపాలెంలో అధికారులు ప్రతిపాదించిన ప్రదేశం నివాస యోగ్యంకాదని, తమకు దిబ్బపాలెం ఎస్ఈజడ్ కాలనీలో, లేదంటే పంచదార్లలో ఇవ్వాలని సీతపాలెం నిర్వాసితులు కోరారు. కానీ అధికారులు ఇంతవరకు పట్టించుకోలేదు. మరోవైపు ఎస్ఈజడ్ కోసం సేకరించిన భూముల్లో కాలక్రమేణా పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటయ్యాయి. ఫార్మా కంపెనీల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో సీతపాలెం గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. నిర్వాసిత గ్రామం కావడంతో అధికారులు ఇక్కడ ఎటువంటి అభివృద్ధి పనులు చేయడంలేదు. రహదారులు అధ్వానంగా వున్నాయి. తాము కోరినచోట ఆర్అండ్ఆర్ కాలనీ ఏర్పాటు చేసి స్థలాలు ఇవ్వాలని, లేదంటే గ్రామాన్ని ఖాళీ చేసేది లేదని సీతపాలెం నిర్వాసితులు స్పష్టం చేస్తున్నారు. దిబ్బపాలెం లేదా పంచదార్లలో పునరావాస కాలనీ ఏర్పాటు చేయాలని, ప్రతి కుటుంబానికి ఐదు సెంట్ల స్థలం ఇవ్వాలని, అందరికీ ఒకేచోట ఇళ్లు నిర్మించాలని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.25 లక్షల చొప్పున సాయం అందించాలని, ఎస్ఈజడ్లో ఏర్పాటయ్యే పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలని కోరుతున్నారు. అంతవరకు గ్రామాన్ని ఖాళీ చేసేది లేదని స్పష్టం చేస్తున్నారు.

గ్రామాన్ని తరలించకుండా పరిశ్రమల ఏర్పాటు సరికాదు

లాలం గణేశ్, ఆర్.నారాయణమ్మ, సీతపాలెం!

ప్రత్యేక ఆర్థిక మండలి కోసం సుమారు రెండు దశాబ్దాల క్రితం మా భూములను తీసుకున్నారు. ఇంతవరకు పునరావాసం కల్పించలేదు. గ్రామాన్ని తరలించకుండా.. మా భూముల్లో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన మూడు పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో గ్రామంలో ఉండలేకపోతున్నాం. చాలా మంది దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు. గ్రామాన్ని తరలించకుండా పరిశ్రమలను ఏర్పాటు చేయడం సరికాదు. అధికారులు గతంలో ఇచ్చిన హామీ మేరకు మేము కోరుకున్న చోట పునరావాల కాలనీ ఏర్పాటు చేయాలి.

# అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పాలు పంపిణీ ప్రారంభం

తెలంగాణలో చిన్నారుల ఆరోగ్యాన్ని బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక ప్రయత్నం ప్రారంభించింది. నాణ్యమైన పోషకాహారాన్ని అందించడం ద్వారా 5 ఏళ్ల లోపు పిల్లల్లో కనిపించే పౌష్టికాహార లోపాన్ని తగ్గించడానికి, అంగన్వాడీ కేంద్రాల్లో విజయ పాలు పంపిణీ చేయనున్నారు. పైలట్ ప్రాజెక్ట్గా ములుగు జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ప్రాథమికంగా, పౌష్టికాహార లోపం ఉన్న పిల్లల్లో వయసుకు తగిన ఎత్తు, బరువు పెరుగుదల తగ్గిపోతుంది, అలాగే తరచుగా అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి. ఈ సమస్యను తగ్గించడం లక్ష్యంగా, మంత్రి డా. దానసరి అనసూయ (సీతక్క) కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి, ప్రీస్కూల్ పిల్లలకు 100 మి.లీ పాలు పంపిణీ చేశారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాల ఆధారంగా త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాన్ని విస్తరించనున్నారు.మంత్రి సీతక్క మాట్లాడుతూ, తెలంగాణను పోషకాహార లోప రహిత రాష్ట్రంగా మార్చడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని అన్నారు. ములుగు జిల్లాను పైలట్ ప్రాజెక్ట్ కోసం ఎంచుకున్నందుకు వెనుకబాటుతనాన్ని అధిగమించడమే లక్ష్యమని తెలిపారు. అంగన్వాడీ టీచర్లకు ముఖ్య బాధ్యతలు విధిస్తూ, చిన్నారుల తల్లిదండ్రులను కార్యక్రమాల గురించి అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు.

# మళ్లీ అన్నదాత సుఖీభవ



**నమస్తే హైదరాబాద్ :** ఒంగోలు, నవంబరు 17 : రైతులకు వ్యవసాయ పెట్టుబడుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధులు బుధవారం విడుదల కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి ఒక్కో రైతుకు రూ.6వేలను మూడు విడతలుగా, రాష్ట్రప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రూ.14వేలను మూడు విడతలుగా ఇస్తున్నాయి. కేంద్రం ఏడేళ్లుగా ఈ పథకాన్ని అమలు చేస్తుండగా, రాష్ట్రప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభించింది. కేంద్రం నిధులు విడుదల చేసే రోజునే రాష్ట్రప్రభుత్వం కూడా ఇవ్వాలని నిర్ణయించింది. అలా రెండు పథకాలు కలిపి మూడు విడతలలో ఒక్కో రైతుకు రూ.20వేల వంతున లబి చేకూరుతోంది. అందులో తొలి విడత ఈ ఏడాది ఆగస్టు 2వ తేదీన విడుదల చేశారు. ఆ రోజున రాష్ట్రవ్యాప్తంగా అన్నదాత-సుఖీభవ నిధులు విడుదల కార్యక్రమాన్ని జిల్లాలోని దర్శి నియోజకర్గం తూర్పువీరాయపాలెం నుంచి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. రెండో విడత నిధులను బుధవారం విడుదల చేస్తున్నారు. ప్రధాని నరేంద్రమోదీ తమిళనాడులోని కోయంబత్తూరులో ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం నుంచి కార్యక్రమం నిర్వహించనున్నారు. అదేసమయంలో రాష్ట్రంలోని అన్నిప్రాంతాల్లో గ్రామ స్థాయిలోని రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్కే) స్థాయిలో లబ్ధిదారులతో సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ పరిధిలోని లబ్ధిదారులను ఆర్ఎస్కే వద్దకు చేర్చి ముఖ్యమంత్రి పాల్గొనే సభ ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రతి ఆర్ఎస్కేలో స్మార్ట్‌టీవీ ద్వారా వీక్షించేలా ఏర్పాటు చేయాలని వ్యవసాయశాఖ కమిషనర్ ఆశాఖ అధికారులను అదేశించారు. అలాగే నియోజకవర్గానికి ఒకచోట స్థానిక ఎమ్మెల్యే, ఇతర కీలక నేతలు పాల్గొనేలా కార్యక్రమాన్ని రూపొందించాలని.. జిల్లాలోని మంత్రులు, కలెక్టర్ వంటి ఉన్నతాధికారులు కూడా ఒకచోట హాజరయ్యేలా కార్యక్రమం ఏర్పాటు చేయాలని సూచించారు. ఇదిలాఉండగా పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల ఎంపిక నిబంధనలలో తేడాల వల్ల ఆ పథకాల లబ్ధిదారుల సంఖ్య కొంత వ్యత్యాసం ఉంది. జిల్లాలో పీఎం కిసాన్ పథకం లబ్ధిదారులు 2,31,380 మందిగా ఇప్పటికే మండలాల వారీగా ప్రకటించారు. వారికి ఆ పథకం కింద ఈ విడత ఒక్కొక్కరికి రూ.2వేల వంతున రూ.46.28 కోట్ల మేర జమ కానున్నాయి. రాష్ట్రప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ఈ విడత ఒక్కొక్కరికి రూ.5వేలు ఇవ్వనుండగా లబ్ధిదారుల వివరాలు మంగళవారం జిల్లా అధికారులకు అందనున్నట్లు సమాచారం.

# ఏపీ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్



**నమస్తే హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధి కోసం సరికొత్త ప్రణాళికలు రచిస్తోంది. హెూంస్టేలు, కారవాన్లు వంటి వినూత్న విధానాల ద్వారా సందర్శకులను కట్టిపడేయాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే హెూంస్టేలు, కారవాన్ టూరిజాన్ని అధికారులు ప్రోత్సహిస్తున్నారు. ఇందులో భాగంగా అల్లూరి జిల్లాలో కారవాన్ టూరిజం ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు . హైదరాబాద్ నుంచి వచ్చిన ఓ కారవాన్ ఆదివారం లంబసింగి చేరుకుంది. ఈ కారవాన్ వాహనంలో మూడు కుటుంబాలు ఉండేలా ఏర్పాట్లు చేశారు. అన్ని సౌకర్యాలు కల్పించారు. ట్రయల్ రన్‌లో భాగంగా కారవాన్ వాహనాన్ని హరిత రిసార్టు అధికారులు పరిశీలించారు. అలాగే అల్లూరి జిల్లాలో కారవాన్ టూరిజానికి ఉన్న అవకాశాలు, ప్రదేశాలు, వనరులను కారవాన్ నిర్వాహకులకు వివరించారు. ఈ ట్రయల్ రన్ విజయవంతమైతే.. వచ్చే రోజుల్లో ఇలాంటి వాహనాలను లంబసింగి, తాజంగిలోనూ అందుబాటులోకి తేనున్నారు.

మరోవైపు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని లంబసింగి, తాజంగి ప్రాంతాల్లో కారవాన్ టూరిజ ప్రాజెక్టులు అమలుచేయాలని ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రాంతాల్లో అవసరమైన ప్రదేశాలను కూడా ఇప్పటికే ఎంపిక చేశారు. రెవెన్యూశాఖ కూడా అవసరమైన స్థలాలను గుర్తించారు. మరోవైపు కారవాన్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రైవేట్ ఆపరేటర్లకు ప్రోత్సాహకాలు కూడా అందించనుంది. 2029 నాటికి ఏపీలో 150 కారవాన్ వాహనాలు, 25 వరకూ కారవాన్ పార్కులు ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. అందుకు అనుగుణంగా కారవాన్ పాలసీని కూడా తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ఏపీలో రిజిస్ట్రేషన్ చేసుకునేకారవాన్ వాహనాలకు లైఫ్ ట్యాక్స్ మినహాయింపుకూడా ఇవ్వనున్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకున్న మొదటి 25 వాహనాలకు వంద శాతం లైఫ్‌టాక్స్ మినహాయింపు ఉంటుంది. మూడు లక్షల రూపాయల వరకూ లైఫ్ ట్యాక్స్ మినహాయిస్తారు ఆ తర్వాత 13 వాహనాలకు 50 శాతం.. అనంతరం రిజిస్ట్రేషన్ చేసుకునే 12 వాహనాలకు 25 శాతం లైఫ్ టాక్స్ మినహాయింపు ఉంటుంది. అలాగే ఏడేళ్లపాటు రాష్ట్ర జీఎస్టీ వెనక్కి చెల్లిస్తారు.

మరోవైపు కారవాన్ పార్కుల అభివృద్ధి కోసం పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన స్థలాలను కూడా కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కారవాన్ వాహనాలను పార్కింగ్ చేసుకోవటంతో పాటుగా వసతి, భోజన సదుపాయాన్ని కారవాన్ పార్కులలో ఏర్పాటు చేయనున్నారు. రవాణా సౌకర్యం లేని మారుమూలల్లో ఉన్న ప్రకృతి అందాలను కూడా ఆస్వాదించేలా పర్యాటకుల కోసం ఈ కారవాన్ టూరిజం ఆలోచన చేశారు.

# సంబరాల సందడి..! పుట్టపర్తికి వేలాదిగా వస్తున్న భక్తులు


**ప్రశాంతి నిలయంలో అలరించిన సంగీతం**

**నేడు రథోత్సవం.. భారీ వెండి రథం సిద్ధం**

**రేపు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు రాక**

**22, 23 తేదీల్లో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పర్యటన**

**భద్రతా వలయంలో పుట్టపర్తి.. పరిసర ప్రాంతాలు**



**నమస్తే హైదరాబాద్ :** పుట్టపర్తి, టౌన, రూరల్, నవంబరు17: సత్యసాయి శత జయంతి వేడుకలకు వచ్చే భక్తులతో పుట్టపర్తి అలరారుతోంది. మహా సమాధిని వేలాది మంది దర్శించుకుంటున్నారు. సాయికుల్వంతు సభా మంటపంలో సోమవారం పండిట్ విశ్వనాథ్ మోహన భట్ బృందం వీణావాయిద్యం భక్తులను అలరించింది. చిత్రావతి నదిలో లేజర్ షో ఆకట్టుకుంటోంది. ఇనచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, బీజేపీ నాయకులు విష్ణువర్ధనరెడ్డి లేజర్ షోను వీక్షించారు. చిత్రావతినది తీరం భక్తులతో కిటకిటలాడింది. మరోవైపు మంగళవారం నిర్వహించే సత్యసాయి రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా 30 అడుగుల ఎత్తైన వెండిరథాన్ని సిద్ధంచేశారు. రథోత్సవం తిలకించడానికి వేలాది మంది భక్తులు ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు.

రేపు ప్రధాని.. 22న రాష్ట్రపతి రాక

శత జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు బుధవారం పుట్టపర్తికి వస్తున్నారు. ప్రధాని బుధవారం ఉదయం సత్యసాయి మహాసమాధిని దర్శించుకుని, హిల్ వ్యూ స్టేడియంలో జరిగే ఉత్సవాల్లో పాల్గొంటారు. ప్రధాని పర్యటనకు భద్రతను పటిష్టం చేశారు. సత్యసాయి విమానాశ్రయం నుంచి ప్రశాంతి నిలయం, హిల్‌వ్యూ స్టేడియం దాకా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 22న రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, సీఎం, పలురాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు వస్తున్నారు. వీరి కోసం విమానాశ్రయంతోపాటు నాలుగు చోట్ల హెలీప్యాడ్‌లు ఏర్పాటు చేశారు. కాన్వాయ్ వెళ్లే మార్గంలో గట్టి భద్రత ఏర్పాటు చేశారు. భక్తుల కోసం హిల్ వ్యూ స్టేడియం సభావేదికకు ఇరువైపులా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు.

అదనపు డీజీ సమీక్ష

జాతీయ స్థాయి వీవీఐపీల పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని ఏపీ లా అండ్ ఆర్డర్ అదనపు డీజీ మధుసూదనరెడ్డి ఆదేశించారు. ఈ నెల 19న ప్రధాని, 22, 23న రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి సహా పలువురు వీవీఐపీలు, వీఐపీలు పుట్టపర్తికి వస్తున్నారు. దీంతో డీపీఓ సమీపంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఐజీ శ్రీకాంత, డీఐజీలు షిమోషి, ఫక్కీరప్ప, అన్బురాజన, సత్యయేసుబాబు, ఎస్పీలు సతీషకుమార్, జగదీష్, పరమేశ్వర్ రెడ్డి, రాధిక, దీపికా పాటిల్, కృష్ణకాంత పటేల్, రాణా, సునీల్ ట్రైనీ తదితర ఉన్నతాధికారులతో ఆయన భద్రతపై సమీక్ష నిర్వహించారు. వీవీఐపీల షెడ్యూల్, మినిట్ టు మినిట్ రూట్ మ్యాప్, భద్రత గురించి డీఐజీ షిమోషి, ఎస్పీ వివరించారు. వేడుకలు, ప్రముఖుల పర్యటనలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని అదనపు డీజీ ఆదేశించారు. స్డేడియం, సాయికుల్వంతు హాలు వెలుపల ప్రతి ఒక్కరినీ తనిఖీ చేయాలని ఆదేశించారు. భక్తులతో మర్యాదగా నడుచుకోవాలని, సూచించారు. ఏ చిన్న సమస్య వచ్చినా కంట్రోల్ రూంకు సమాచారం అందచేయాలని సూచించారు.నేడు డీఎంఈ రాక

అనంతపురం వైద్యం(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జయంతి వేడుకలను పురస్కరించుకుని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన(డీఎంఈ) డాక్టర్ రఘునందన మంగళవారం పుట్టపర్తి రానున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు ఇతర ప్రముఖులు బుధవారం సత్యసాయి జయంతి వేడుకలకు రానున్న తరుణంలో ప్రత్యేక అత్యవసర వైద్యసేవల కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ వైద్యవిద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఫోరెన్సిక్ హెచఓడీ ప్రొఫెసర్ ఆర్.శంకర్ లైజనింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. ఇప్పటికే కళాశాల నుంచి వివిధ విభాగాల స్పెషల్ డాక్టర్లకు డ్యూటీలు కేటాయించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం నుంచి 23వరకు ప్రత్యేక అత్యవసర కేంద్ర సేవలు కొనసాగనున్నాయి. కాగా డీఎంఈ రఘునందనతోపాటు అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వర్లు, స్టేట్ నోడల్ ఆఫీసర్ అనురాధ తదితరులు వేడుకలకు రానున్నట్లు లైజనింగ్ ఆఫీసర్ డాక్టర్ శంకర్ పేర్కొన్నారు.

వేడుకలు విశ్వవ్యాప్తం: రత్నాకర్

సత్యసాయి శత జయంతి వేడుకలకు దేశ విదేశాల నుంచి తరలివచ్చిన భక్తులతో పుట్టపర్తిలో కోలాహలం నెలకొందని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ అన్నారు. సత్యసాయి ప్రేమ, సందేశాలు విశ్వ వ్యాప్తంగా ప్రతి?ధ్వనిస్తున్నాయని అన్నారు. ప్రశాంతి నిలయం రేడియో సాయి వద్ద అఖిలభారత సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు నిమీష్ పాండేతో కలిసి సోమవారం మీడియాతో మాట్లాడారు. వేడుకలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారం, ఏర్పాట్ల గురించి వివరించారు. సెంట్రల్ ట్రస్ట్, సేవాసంస్థలు, సిబ్బంది, సాయి విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, కార్యకర్తల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. శత జయంతి ఉత్సవాలకు ఏడాది కాలంగా రూపకల్పన చేశామని, దేశవిదేశీ భక్తులు 220కిపైగా సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారని తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు వసతి, భోజనం, దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. రైల్వే స్టేషన నుంచి ప్రశాంతి నిలయం వరకూ దారులన్నీ విద్యుత కాంతులు పరుచుకున్నాయని తెలిపారు. సాయి భక్తులు స్వచ్ఛందంగా ఏర్పాట్లు చేస్తున్నారని అన్నారు.

సీఎం చంద్రబాబు చొరవ..

రాష్ట్ర ప్రభుత్వం సత్యసాయి శత జయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రభుత్వం, ట్రస్టు కలిసి ఘనంగా వేడుకలు జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబానాయుడు ప్రత్యేక చొరవ చూపించారని, అధికార యంత్రాంగాన్ని దించి పని చేయిస్తున్నారని అన్నారు. కేద్రం ప్రభుత్వం 160 ప్రత్యేక రైళ్లు వేసిందని అన్నారు. ఈ నెల 19న ప్రధాని చేతుల మీదుగా సత్యసాయి శత జయంతి స్మారక చిహ్నంగా వంద రూపాయల నాణెం, నాలుగు తపాల స్టాంపులను ఆవిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సవాల్లో జిల్లాలో వంద మంది రైతులకు పాడి ఆవులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఏటా 18న జరిగే వేణుగోపాలస్వామి రథోత్సవాన్ని సత్యసాయి రథోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సత్యసాయి శత జయంతి వేడుకలు భక్తులకే కాదని, సమస్త సృష్టి కోసం, మనుషులు, జంతువులు, ప్రకృతి, చెట్లు, పక్షులు అన్నింటికీ పరమ పవిత్రమైన పండుగ అని నిమీష్ పాండే అన్నారు.

నేడు పుట్టపర్తికి గవర్నర్

ఉత్సవాల్లో పాల్గొననున్న డీసీఎం, మంత్రి లోకేశ

సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన కల్యాణ్, మంత్రి నారాలోకేశ మంగళవారం పుట్టపర్తికి రానున్నారు. గవర్నర్ అబుల్ నజీర్ విజయవాడలో సాయంత్రం నాలుగు గంటలకు ప్రత్యేక విమానంలో బయల్దేరి 5.20 గంటలకు సత్యసాయి విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రికి శ్రీనివాస అథితి గృహంలో బస చేస్తారు. బుధవారం ఉదయం 9.45కి ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి సత్యసాయి విమానాశ్రయంలో స్వాగతం పలుకుతారు. అనంతరం సాయికుల్వంత హాలులో సత్యసాయి మహా సమాధిని దర్శించుకుంటారు. తర్వాత 10.30 హిల్‌వ్యూ స్టేడియంలో ప్రధానితోపాటు సత్యసాయి శత జయంతి వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం తిరుపతికి వెళ్తారు. డిప్యూటీ సీఎం సాయంత్రం 4 గంటలకు విజయవాడలో ప్రత్యేక విమానంలో బయలుదేరి సాయంత్రం 5 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రికి ప్రశాంతి నిలయంలోని శ్రీనివాస అ?థితి గృహంలో విడిది చేస్తారు. ఐటీ శాఖ మంత్రి నారాలోకేశ మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో 3.40గంటలకు ప్రత్యేక హెలీకాప్టర్‌లో బయల్దేరి పుట్టపర్తి విమానాశ్రయానికి 5.10కి చేరుకుంటారు. పుట్టపర్తిలో కప్పలబండ ఏపీఐఐసీ పార్కులో ఏర్పాటు చేసిన ప్రత్యేక విడిది కేంద్రంలో బసచేస్తారు. బుధవారం పుట్టపర్తి విమానాశ్రానికి చేరుకుంటారు. ప్రధాన మంత్రిని స్వాగతం పలుకుతారు. పది గంటలకు సాయికుల్వంత హాలులో సత్యసాయిబాబా మహాసమాధిని దర్శించుకుంటారు. 10.30 హిల్‌వ్యూ స్టేడియంలో నిర్వహించే సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 1 గంటకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుని వెళ్తారు. సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎనవీ రమణ మధ్యాహ్నం 12.45కి బెంగళూరు విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో పుట్టపర్తి చేరుకుని రాత్రికి పుట్టపర్తిలో బసచేస్తారు.

# రోడ్డుపై పిన్ నంబరుతో పాటు దొరికిన ఏటీఎం కార్డు.... కానీ చివరకు

**నమస్తే హైదరాబాద్ :** మీరలా సరదాగా రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నారు.. చుట్టూ వచ్చీపోయే జనాలను గమనిస్తూ, మనసులో మెగాస్టార్ పాటను హమ్ చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఇంతలో మీకు ఎదురుగా రోడ్డుపై ఒకటి కనిపించింది.. ఏంటా అని దగ్గరకు వెళ్లి చూస్తే.. అదో ఏటీఎం కార్డు. దానిపై పిన్ నంబర్ కూడా ఉంది. అరేయ్ పాపం ఎవరో పడేసుకున్నారనుకుంటే పర్లేదు. కానీ లచ్చిందేవి.. లచ్చిందేవి.. లచ్చిందేవి.. కలిసొచ్చిన లక్ష్మిదేవి. నడిచి వచ్చిన లక్ష్మిదేవి అనుకుంటూ ఏటీఎం సెంటర్‌కు పరుగులు తీస్తే.. ఇదిగో ఈ మహిళ సంగతే మీకు కూడా.. తమిళనాడులోని వేలూరులో ఈ ఘటన జరగ్గా.. బాధితురాలు ఏపీకి చెందిన వారు.. ఇన్బకుమారి అనే మహిళది చిత్తూరు జిల్లాలోని గుడిపాల. ఆమె భర్త మాజీ సైనికుడు. అయితే ఇన్బకుమారి, కుమార్తె రేచల్ కలిసి ఇటీవల కళ్లద్దాలు కొనుగోలు చేయడం కోసం వేలూరు వెళ్లారు. వేలూరులోని మాజీ సైనికుల సంక్షేమ కార్యాలయం వెళ్లారు. అయితే అక్కడి సిబ్బంది ఆధార్ కార్డు వివరాలు కావాలని కోరారు. ఆధార్ కార్డు జిరాక్స్ కాపీని తేవాలని సూచించారు. దీంతో ఇన్బకుమారి సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్ వద్దకు వెళ్లారు. అయితే వెళ్లే సమయంలో.. వారి బ్యాగులోని ఏటీఎం కార్డు, పిన్ నంబర్ రాసిపెట్టుకున్న స్లిప్ పడిపోయింది. ఈ విషయాన్ని ఇన్బకుమారి గమనించుకోలేదు.అయితే కొద్ది సేపటి తర్వాత బ్యాంక్ ఖాతా నుంచి 50 వేల రూపాయలు డ్రా చేసినట్లు ఇన్బకుమారి మొబైల్ ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో బ్యాగ్ చెక్ చేసుకున్న ఇన్బకుమారి ఏటీఎం కార్డు పోయినట్లు గుర్తించారు. వెంటనే వేలూరు సౌత్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు మొదలుపెట్టారు. బ్యాంక్ లావాదేవీ ఆధారంగా ఏఏటీఎం కేంద్రం వద్ద డబ్బులు డ్రా చేశారనే సంగతి గుర్తించారు. ఈ క్రమంలోనే రాజపాళ్యానికి చెందిన దేవి అనే మహిళ డబ్బులు ఏటీఎం సెంటర్ నుంచి డ్రా చేసినట్లు సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా గుర్తించారు.ఆ మహిళలను అదుపులోకి తీసుకుని విచారించగా.. రోడ్డుపై దొరికిన ఏటీఎం కార్డుతో డబ్బులు డ్రా చేసినట్లు అంగీకరించింది. విత్ డ్రా చేసిన 50 వేల రూపాయల్లో 30 వేలు పెట్టి బంగారు కమ్మలు కొనుగోలు చేసినట్లు చెప్పింది. దీంతో పోలీసులు దేవిని అరెస్ట్ చేశారు. ఆమె నుంచి నగలు, రూ.20 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్ కోసం జైలుకు తరలించారు.



# వీ.ఆర్.ఏ ల సమస్యలను తక్షణమే పరిష్కరించండి..



**నమస్తే హైదరాబాద్ :** జిల్లా పరిధిలో పని చేస్తున్న వీఆర్ఏల సమస్యల ను తక్షణమే పరిష్కరించాలని వీఆర్ఏల సంఘం జిల్లా సహాధ్యక్షులు మధుబాబు, మరియు ఎన్టీఆర్ జిల్లా లోని అన్ని మండలం వీఆర్ఏలు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ చైతన్య ను కలిసి పలు సమస్యల పై వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్హులైన వీఆర్ఏల సీనియారిటీ జాబితా ప్రకటించి వీఆర్ఏ లకు అటెండర్ వాచ్మెన్, డ్రైవర్లు, రికార్డు అసిస్టెంట్ ప్రమోషన్ లు కల్పించాలని ఎన్నో సంవత్సరాలుగా రు.10,500 జీతంతో కుటుంబ పోషణ భారంగా ఉందని ప్రభుత్వ కార్యక్రమాలలో అన్ని సంక్షేమ పథకాల అమలులో తమా వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలియచేశారు. వీఆర్ఏల సమస్యలు తక్షణమే వీఆర్ఓ ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం అని సబ్ కలెక్టర్ చైతన్య తెలిపారు.

# సినిమా



## 'కాపాడే వాడే చంపడం మొదలుపెడితే'.

రాజ్ తరుణ్, అమృత చౌదరి హీరో హీరోయిన్ గా నటిస్తోన్న లేటెస్ట్ సినిమా "టార్టాయిస్". రిత్విక్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో శ్రీనివాస్ అవసరాల, ధన్య బాలకృష్ణ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ప్రశ్వితి ఎంటర్టైన్మెంట్, ఎస్ కె గోల్డెన్ ఆర్ట్స్, చందమామ క్రియేషన్స్, ఎన్ వి ఎల్ క్రియేషన్స్ పతాకం పై శశిధర్ నల్ల, విజయ్ కుమార్, సంతోష్ ఇమ్మడి మరియు రామిశెట్టి రాంబాబు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సోమవారం (నవంబర్ 17) ఈ సినిమా పూజా కార్యక్రమాలు హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్ లో ఘనంగా జరిగాయి. అలాగే ఈ చిత్రానికి సంబంధించిన మోషన్ పోస్టర్ ను విడుదల చేసారు. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత చంద్రబోస్ గారు లిరిక్స్ అందించగా అనూప్ రూబెన్స్ సంగీతం సమకూరుస్తున్నారు. ఈ సందర్భంగా హీరో రాజ్ తరుణ్ మాట్లాడుతూ ""టార్టాయిస్" చిత్రం చాలా కొత్తగా ఉంటుంది. చాలా డిఫరెంట్ కథ, దర్శకుడు రిత్విక్ కుమార్ కథ చెప్పిన విధానం చాలా బాగుంది. ఇంత మంచి కథతో వస్తున్నా మా నిర్మాతలు శశిధర్ నల్ల, విజయ్ కుమార్, సంతోష్ ఇమ్మడి, రామిశెట్టి రాంబాబు గార్లకి కంగ్రాట్స్. ఈ చిత్రం నా కెరీర్ కి మంచి కిక్ ఇస్తుంది" అని తెలిపారు.దర్శకుడు రిత్విక్ కుమార్ మాట్లాడుతూ "మా సినిమా పూజ కార్యక్రమానికి విచ్చేసిన మీడియా మిత్రులకు స్వాగతం. "టార్టాయిస్" చిత్రం చాలా కొత్తగా ఉంటుంది. రాజ్ తరుణ్ గారికి కెరీర్ లో బెస్ట్ సినిమా అవుతుంది. శ్రీనివాస్ అవసరాల, ధన్య బాలకృష్ణ, హీరోయిన్ అమృత చౌదరి క్యారెక్టర్స్ చాలా బలంగా ఉంటాయి. కొత్త స్క్రీన్ ప్లే తో డిఫరెంట్ కథ తో మంచి థ్రిల్లర్ చిత్రం ఇది. త్వరలో షూటింగ్ ప్రారంభిస్తాం. ఈరోజు మా చిత్రానికి సంబంధించిన మోషన్ పోస్టర్ ను కూడా విడుదల చేసాం. నన్ను నమ్మి నాకు ఈ అవకాశం ఇచ్చిన నా నిర్మాతలు శశిధర్ నల్ల, విజయ్ కుమార్, సంతోష్ ఇమ్మడి, రామిశెట్టి రాంబాబు గార్లకి నా ధన్యవాదాలు.నిర్మాతలు శశిధర్ నల్ల, విజయ్ కుమార్, సంతోష్ ఇమ్మడి, రామిశెట్టి రాంబాబు గార్లు మాట్లాడుతూ "మా "టార్టాయిస్" చిత్రం ఈ రోజు ప్రారంభం అయింది. మాకు కథ చాలా బాగా నచ్చింది. త్వరలో షూటింగ్ ప్రారంభం అవుతుంది. మా దర్శకుడు రిత్విక్ కుమార్ పై మాకు పూర్తి నమ్మకం ఉంది. రాజ్ తరుణ్ గారితో సినిమా చేయడం చాలా సంతోషంగా ఉంది" అని తెలిపారు.





## చలికాలంలో క్యాప్సికమ్ తింటే ఈ వ్యాధులకు బైబై చెప్పొచ్చు..!

క్యాప్సికమ్‌లో లుటిన్, జియాక్సంతిన్ వంటి కెరోటినాయిడ్లు కనిపిస్తాయి. ఇవి కళ్ళను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీర్ణక్రియ మెరుగవుతుంది. శక్తి ప్రదాతగా పని చేస్తుంది. బరువు తగ్గించడంలో సహాయపడుతుంది. క్యాన్సర్ నిరోధంలో సహాయకారి. ఈ కూరగాయలో ఫ్లేవనాయిడ్స్ అనే యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరాన్ని ఆక్సీకరణ నష్టం నుండి రక్షిస్తాయి. ఎర్ర క్యాప్సికమ్‌లో కనిపించే క్యాప్సంతిన్ అనే యాంటీఆక్సిడెంట్ చర్మాన్ని హానికరమైన కిరణాల నుండి రక్షిస్తుంది. క్యాప్సికమ్‌లో విటమిన్లు ఎ, సి పుష్కలంగా ఉంటాయి. ఇవి మీ రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. అనేక వ్యాధుల నుండి మిమ్మల్ని రక్షించడంలో సహాయపడతాయి. శరీరంలో రక్తం లేకపోవడం వల్ల రక్తహీనత వస్తుంది. కానీ క్యాప్సికమ్‌లో ఉండే ఐరన్ కంటెంట్ రక్తహీనత ప్రమాదాన్ని నివారించడంలో సహాయపడుతుంది.

క్యాప్సికమ్‌లో యాంటీఆక్సిడెంట్ లైకోపీన్, విటమిన్లు సి, ఎ లకు మంచి మూలం. ఈ పోషకాలన్నీ గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి. అంతేకాదు.. బరువు తగ్గడానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. బరువు పెరగడంతో ఇబ్బంది పడుతున్న వారు తమ ఆహారంలో క్యాప్సికమ్‌ను చేర్చుకోవచ్చు. వీటిని తినడం వల్ల బరువు తగ్గడానికి సహాయపడుతుంది.క్యాప్సికమ్ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుండి కూడా రక్షించడంలో సహాయపడతాయి. వాటిలో అపిజెనిన్, లూపియోల్, క్యాప్సియేట్, కెరోటినాయిడ్లు ఉంటాయి. ఇవి క్యాన్సర్‌తో పోరాడే యాంటీఆక్సిడెంట్లు.




## వెల్లుల్లి స్ప్రేతో ఇంట్లో దోమలు చిటికెలో పరార్.

వర్షాకాలం, శీతాకాలాల్లో వాతావరణం చల్లగా ఉండటం వల్ల దోమలు, కీటకాలు ఇంట్లోకి ప్రవేశిస్తుంటాయి. ఇవి ఇంట్లోకి ప్రవేశిస్తే చికాకు కలిగిస్తాయి. అందుకే వీటిని వదిలించుకోవడానికి చాలా మంది మార్కెట్లో లభించే రసాయన స్ప్రేలను ఉపయోగిస్తుంటారు. ఈ స్ప్రేల ఘాటు వాసన, విషపూరిత పదార్థాలు పిల్లలు, పెంపుడు జంతువులకు హానికరం కావచ్చు. ఇటువంటి పరిస్థితిలో ఇంట్లో సులభంగా లభించే వెల్లుల్లిని ఉపయోగించి సహజ స్ప్రేని తయారు చేసుకోవచ్చు. ఈ వెల్లుల్లి స్ప్రే ఇంట్లోకి ప్రవేశించిన కీటకాలను సమర్థవంతంగా పారదోలుతాయి.వెల్లుల్లి స్ప్రే

వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ అనే సహజ సమ్మేళనం కీటకాలకు అస్సలు ఇష్టం ఉండదు. అందుకే వెల్లుల్లిని దోమలు, ఈగలు, చీమలు వంటి క్రిమి కీటకాలను తరిమికొట్టడానికి ఉపయోగించవచ్చు. అలాగే వెల్లుల్లి స్ప్రేలో ఎండిన మిరపకాయలను కూడా జోడించవచ్చు. వీటిల్లో క్యాప్సైసిన్ కంటెంట్ కీటకాలపై మండే ప్రభావాన్ని చూపుతుంది. ఈ రెండింటి మిశ్రమంతో తయారు చేసిన స్ప్రే కీటకాలను సులభంగా తరిమికొట్టడంలో ప్రభావవంతంగా పని చేస్తుంది. ఇతర రసాయన స్ప్రేని ఉపయోగించాల్సిన అవసరం లేదు.

వెల్లుల్లి స్ప్రే ఎలా తయారు చేయాలంటే?

5-6 వెల్లుల్లి రెబ్బలు, 2-3 ఎండు మిరపకాయలు లేదా 1 టీస్పూన్ మిరపకాయల పొడి, 1 లీటరు నీళ్లు తీసుకోవాలి. ముందుగా వెల్లుల్లి, మిరపకాయలను బ్లెండర్‌లో వేసి మెత్తగా రుబ్బుకోవాలి. తర్వాత ఒక పాత్రలో ఒక లీటరు నీళ్లు పోసి గ్యాస్ స్టవ్ మీద ఉంచి, అందులో తరిగిన వెల్లుల్లి, మిరపకాయలు వేసి 5-10 నిమిషాల పాటు మంట మీద మరిగించాలి. చల్లారిన తర్వాత ఈ మిశ్రమాన్ని వడకట్టి స్ప్రే బాటిల్‌లో పోయాలి. ఇంట్లో కీటకాలు, సాలెపురుగులు కనిపించిన ప్రతిచోటా ఈ స్ప్రేను పిచికారీ చేయాలి. మీరు దీన్ని కిటికీలు, తలుపులు, గోడలు, వంటగది, చెత్త డబ్బాల చుట్టూ కూడా పిచికారీ చేయవచ్చు. రోజుకు కనీసం 2 నుండి 3 సార్లు ఉపయోగించవచ్చు. మీకు కావాలంటే ఈ స్ప్రేలో కొన్ని చుక్కల సిట్రోనెల్లా, పిప్పరమెంటు, యూకలిప్టస్ వంటి ఎసెన్షియల్ నూనెను కూడా కలపవచ్చు. ఇది సువాసనను పెంచడంతోపాటు దాని ప్రభావాన్ని మరింత అధికం చేస్తుంది.ఈగలు, కీటకాలను తరిమికొట్టడానికి ఒక స్ప్రే బాటిల్‌లో వెనిగర్, నిమ్మరసం, నీటితో కలిపి ఈగలు తరచుగా వచ్చే ప్రదేశాలలో పిచికారీ చేయాలి. దీనిలోని ఆమ్ల లక్షణాలు కీటకాలు ఇంట్లోకి రాకుండా నిరోధిస్తాయి. వేప, లవంగాలు కూడా కీటకాలను తరిమికొట్టడంలో సహాయపడతాయి. మీరు ఈ రెండింటినీ కలిపి రుబ్బుకుని, నీటితో కలిపి, కీటకాలు ఎగురుతున్న ప్రదేశాలలో పిచికారీ చేయవచ్చు.

## క్లీన్ స్వీప్ భయం..

కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో సౌతాఫ్రికా చేతిలో తొలి టెస్ట్ మ్యాచ్ ఓడిపోయిన భారత క్రికెట్ జట్టు, ఇప్పుడు రెండో టెస్ట్ కోసం తీసుకుంటున్న నిర్ణయం నిజంగా ఆశ్చర్యకరం. ఈ నిర్ణయం వల్ల గువాహటిలో జరగబోయే చివరి టెస్ట్‌లో కూడా టీమిండియా ఓడిపోయే ప్రమాదం ఉందని క్రికెట్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకీ టీమిండియా తీసుకున్న ఆ నిర్ణయం ఏంటి? గువాహటి టెస్ట్‌పై ఎలాంటి ప్రభావం చూపనుందో తెలుసుకుందాం.నివేదికల ప్రకారం భారత జట్టు సాధారణంగా మ్యాచ్ ముగిసిన వెంటనే తదుపరి వేదికకు వెళ్తుంది. కానీ ఈసారి కోల్‌కతాలో ఓడిపోయిన తర్వాత కూడా టీమిండియా అక్కడే ఉండిపోయింది. మంగళవారం రోజు ఈడెన్ గార్డెన్స్‌లోనే ప్రాక్టీస్ చేయాలని జట్టు నిర్ణయించుకుంది. జట్టు కోల్‌కతాలో ప్రాక్టీస్ చేయాలని నిర్ణయించడం చూస్తుంటే, గువాహటిలో కూడా కోల్‌కతా పిచ్‌లాంటిదే తయారు చేయాలని మేనేజ్‌మెంట్ ప్లాన్ చేస్తున్నట్లు అనుమానాలు వస్తున్నాయి. కోల్‌కతాలో స్పిన్‌కు అనుకూలించిన పిచ్‌పై భారత బ్యాట్స్‌మెన్ ఘోరంగా విఫలమయ్యారు. అయినా సరే, గువాహటిలో కూడా స్పిన్ ఫ్రెండ్లీ పిచ్‌నే తయారు చేయాలని టీమిండియా మొగ్గు చూపుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

గువాహటిలో భారత్-సౌతాఫ్రికా మధ్య రెండో, చివరి టెస్ట్ మ్యాచ్ నవంబర్ 22 నుంచి ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లో కూడా స్పిన్‌కు అనుకూలించే వికెట్‌ను తయారు చేస్తే, భారత బ్యాట్స్‌మెన్‌కు మళ్లీ కష్టాలు తప్పకపోవచ్చు. గతంలో న్యూజిలాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో భారత్ 0-3 తేడాతో ఓడిపోయింది. వెస్టిండీస్‌పై గెలిచినా, వారికి నాణ్యమైన స్పిన్నర్లు లేరు. కానీ ఇప్పుడు సౌతాఫ్రికా జట్టులోని స్పిన్నర్లు భారత బ్యాట్స్‌మెన్‌ను బాగా ఇబ్బంది పెడుతున్నారు. ఇలాంటి సమయంలో కూడా పిచ్ స్వభావాన్ని మార్చకుండా స్పిన్ పిచ్‌పైనే ఆధారపడాలని అనుకోవడం క్లీన్ స్వీప్ ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నట్లేనని విమర్శలు వినిపిస్తున్నాయి.టీమిండియాకు మరో ముఖ్యమైన ఆందోళన ఏమిటంటే రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండో టెస్ట్‌కు అందుబాటులో ఉండకపోవడం. తొలి టెస్ట్ సమయంలో ఆయన మెడకు గాయం కావడంతో ఐసీయూలో కూడా చికిత్స తీసుకున్నారు. దీంతో గువాహటి టెస్ట్‌లో గిల్ ఆడటం కష్టమే అని తెలుస్తోంది. ఒకవేళ గిల్ ఆడకపోతే అతని స్థానంలో యువ ఆటగాళ్లు సాయి సుదర్శన్ లేదా దేవదత్ పడిక్కల్‌లో ఒకరికి తుది జట్టులో అవకాశం దక్కే ఛాన్స్ ఉంది. కెప్టెన్ లేకపోవడం, పైగా పిచ్ విషయంలో రిస్క్ తీసుకోవడం.. ఇవన్నీ కలిపి గువాహటి టెస్ట్ ఫలితాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో చూడాలి.



## జనవరిలోనే ఉమెన్ క్రికెట్ ఫైర్..

మహిళల క్రికెట్‌కు కొత్త ఊపునిచ్చిన ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (%బ్లూ%) నాలుగో సీజన్‌కు సిద్ధమవుతోంది. మూడు సీజన్లలో అభిమానులను స్టేడియంలకు రప్పించిన ఈ మెగా టోర్నమెంట్ నాలుగో ఎడిషన్ వచ్చే ఏడాది జనవరి 7 నుంచే ప్రారంభం కానుంది. ఈసారి ఐదు ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్ జాబితాలను సమర్పించగా, టోర్నమెంట్ తేదీలు, వేదికలపై నిర్వాహకులు కసరత్తు పూర్తి చేశారు. %బ్లూ% నాలుగో సీజన్ జనవరి 7 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరగనుంది.వచ్చే ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలో పురుషుల టీ20 వరల్డ్ కప్ ప్రారంభం కానుండడంతో, %బ్లూ% షెడ్యూల్‌ను ఒక నెల ముందుకు జరిపారు. ఈసారి %బ్లూ% మ్యాచ్‌లు మూడో సీజన్ మాదిరిగా కాకుండా, రెండు నగరాల్లో నిర్వహించే అవకాశం ఉంది. రెండు దశల్లో జరిగే ఈ మెగా ఈవెంట్‌కు ముంబై, బరోడా వేదికలుగా ఎంపికయ్యాయి. మొదటి దశ నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో మ్యాచ్‌లు జరుగుతాయి.రెండో దశ బరోడాలోని కోటంబి గ్రౌండ్‌లో జనవరి 16 నుంచి ఫిబ్రవరి 3 ఫైనల్ వరకు మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది. అయితే టోర్నమెంట్ ప్రారంభ తేదీ, వేదికలపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.నాలుగో సీజన్ వేలంలో ఫ్రాంచైజీలు మొత్తం రూ.15 కోట్లు ఖర్చు చేయనున్నారు. స్లాబ్స్ ప్రకారం.. ఒక క్రికెటర్‌కు గరిష్టంగా రూ.3.5 కోట్లు చెల్లించే అవకాశం ఉంది. ప్రపంచ కప్‌లో అద్భుతంగా ఆడిన టీమిండియా సభ్యురాలు స్మృతి మంధానను ఆర్‌సీబీ రికార్డు ధర రూ.3.50 కోట్లకు రిటైన్ చేసుకుంది. వరల్డ్ కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్?గా నిలిచిన దీప్తి శర్మను యూపీ వారియర్స్ విడుదల చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

ఒక ఫ్రాంచైజీ ఐదుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకుంటే, వారి పర్స్ నుంచి రూ.9.75 కోట్లు తీసివేస్తారు. నలుగురిని రిటైన్ చేస్తే రూ.8.75 కోట్లు, ముగ్గురిని రిటైన్ చేస్తే రూ.7.75 కోట్లు, ఇద్దరిని రిటైన్ చేస్తే రూ.6 కోట్లు కట్ అవుతుంది.

వేలానికి ముందు వివిధ జట్ల పర్స్‌లో మిగిలిన డబ్బు వివరాల్లోకి వెళితే.. ఈసారి వేలంలో ఎక్కువ డబ్బుతో బరిలోకి దిగుతున్న జట్టు యూపీ వారియర్స్. ఈ జట్టు కేవలం శ్వేత షెరావత్‌ను (రూ.50 లక్షలు) మాత్రమే రిటైన్ చేసుకుంది. అందుకే వారి పర్స్‌లో అత్యధికంగా రూ.14.5 కోట్లు మిగిలి ఉన్నాయి.



Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..